PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 207 | విజయవాడ, మంగళవారం 28 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 28 February 2023 | Rs

కార్మిక సంఘాల ధర్నా భగ్నం

- బలవంతంగా నాయకుల అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాను పోలీసులు భగ్నం చేశారు. పలువురి నాయకులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు, ప్రభుత్వ తీరును నాయకులు తీవ్రంగా ఖండించారు. కేంద్ర కార్మిక సంఘాల ధర్నాకు పిలుపునివ్వడంతో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద టూ టౌన్ సిఐ నాయక్ ఆధ్వర్యంలో భారీగా పోలీసులు మోహరించారు.

కలెక్టరేట్ నాలుగు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు అక్కడకు చేరుకోకుండా బందోబస్తును ఉంచారు. వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న కార్మికులు, నాయకులు కలెక్టరేట్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని బలవంతంగా జీపుల్లోకి ఎక్కించి కాకినాడ పోర్టు స్టేషన్‌కు తరలించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కుని కాపాడాలని, జగన్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలని, కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించమంటే అరెస్టులా? అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. పోలీజులు అరస్టు చేసినవారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్వరరావు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, మహిళా నాయకులు చంద్రమళ్ల పద్మ కార్మికులు ఉన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా కాకినాడ జిల్లాలో మాత్రమే కలెక్టరేట్ వద్ద ఆందోళన నిషేధిస్తూ అప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన సాగుతోందని, దీనిని ప్రతిఘటిస్తామని తెలిపారు. కార్మికుల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని, పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వామపక్షాలు, దళిత, ప్రజా సంఘాల నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారు.


కార్మిక సంఘాల నాయకులను బలవంతంగా వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

- న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రవాణా రంగంలో సమస్యలను పరిష్కరించి, లారీ యజమానులను ఆదుకోవాలని న్యూ ఆంధ్ర మోటార్ ట్రక్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద ఉన్న స్పందన కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన అసోసియేషన్ నాయకులను సచివాలయంలో ఇవ్వాలని అధికారులు సూచించారు. దీంతో రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్నకు నాయకులు వినతిపత్రం అందజేశారు. త్రైమాసిక పన్నులను, డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు. వన్‌నేషన్ వన్ ట్యాక్స్ ద్వారా రోడ్డు ట్యాక్స్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రవాణా కిరాయిని కిలోమీటరు ప్రకారం గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లాకూ ఒక డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. లోడింగ్, అన్‌లోడింగ్‌లో జాప్యం జరిగితే లారీ ఓనర్‌కు వెయిటింగ్ ఛార్జీలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని స్టేట్‌హైవేలను, ఇతర రోడ్ల పరిస్థితిని మెరుగుపర్చాలని తెలిపారు. వ్యాపారికి, వాహన యజమానికి మధ్య ఉన్న దళారులకు లైసెన్స్‌ను తప్పనిసరి చేయాలన్నారు. రోడ్లపై డ్రైవర్లకు అధికారికంగా విశ్రాంతి పాయింట్లను ఏర్పాటుచేసి అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ట్రాఫిక్, రవాణాశాఖ అధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు.

కవిత కూడా జైలుకే..

- మాజీ ఎంపి వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి- తిరుమల

మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లిన మనీష్ సిసోడియా తరహాలోనే కల్వకుంట్ల కవిత కూడా జైలుకు వెళ్తారని మాజీ ఎంపి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం ఆయన కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం బయట ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఖజానాను కెసిఆర్ దోచుకున్నారని విమర్శించారు. తనపైన ఉన్న వ్యతిరేకతను మళ్లించేందుకే కెసిఆర్ భారస పార్టీ స్థాపించారని విమర్శించారు. తెలంగాణలో సంపాదించిన సొమ్మును కెసిఆర్ ఖర్చు చేస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమల శ్రీవారిని టీంఇండియా మహిళ జట్టు సభ్యురాలు ప్రణవి చంద్ర కూడా దర్శించుకున్నారు.

గల్లంతైన ఆరుగురూ మృతి

- ముగిసిన అంత్యక్రియలు
- మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-పొదలకూరు (నెల్లూరు)

నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తోడేరు గ్రామంలో పడవ షికారుకు వెళ్లి గల్లంతైన వారిలో ఆరుగురూ మృతి చెందారు. తోడేరు కొత్త చెరువులో పదిమంది యువకులు పడవలో ఆదివారం షికారుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసింది. వారిలో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా..మిగతా ఆరుగురి కోసం ఆదివారం రాత్రంతా అధికారులు గాలించారు. సోమవారం ఉదయం మరోమారు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. ఐదు మృతదేహాలను వెలికితీశారు. మరో యువకుడి మృతదేహం కోసం తీవ్రంగా శ్రమించారు. చెరువు మొత్తం జల్లెడవేశారు. సాయంత్రానికి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతిచెందిన వారిలో చల్లా ప్రశాంత్ (29), మన్నూరు కల్యాణ్ (27), బట్టా రఘు (23), పాటి సరేంద్ర (19), యత్తం బాలాజీ (21), అల్లి శ్రీనాథ్ (17) ఉన్నారు. ఎస్‌పి విజయరావు పర్యవేక్షణలో పొదలకూరు సిఐ సంగమేశ్వర రావు, ఎస్‌ఐ కరీముల్లా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గల్లంతైన వారు అవతల వైపు ఒడ్డుకు చేరుకొని, ఎలాగైనా తిరిగి క్షేమంగా వస్తారని ఆశిస్తూ.. ఎదురుచూస్తున్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరయ్యాయి.

మిన్నంటిన రోదనలు

పడవలో షికారుకు వెళ్లి ఒకేసారి ఆరుగురు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. చేతికి అందివచ్చిన కొడుకులు మరణించడంతో తల్లిదండ్రుల ఆక్రందనలు మిన్నంటాయి. గ్రామంలోని శ్మశన వాటికలో ఆరుగురికి అంత్యక్రియలు నిర్వహించారు. కేరళలో అధికారిక పర్యటనలో ఉన్న మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఈ సమాచారం తెలియగానే వెంటనే బయల్దేరి ఆదివారం అర్ధరాత్రికి తోడేరుకు చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌కు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి సోమవారం లేఖ రాశారు. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చుల సర్దుబాటు ఛార్జీల నిబంధనలు మార్పుపై ప్రజల సూచనలు, అభ్యంతరాలు చెప్పారని నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ఇంధనం, విద్యుత్ కొనుగోళ్లలో పెరిగిన ఖర్చుల ఆధారంగా వినియోగదారుల అభ్యంతరాలు తీసుకోకుండా ఏకపక్షంగా ప్రతినెలా వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.50 పైసలు చొప్పున వసూలు చేయటానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ ప్రకారం వచ్చే ఏడాదిలో రూ.3,425 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.2,900 కోట్లు వసూళ్లు చేస్తున్నారని, టారిఫ్ వివిధ రూపాల్లో పెంచి వినియోగదారులపై భారాలు మోపుతున్నారని తెలిపారు. తాజా సవరణ వల్ల ఏకపక్షంగా పంపిణీ సంస్థలు ప్రజలకు తెలపకుండానే ఛార్జీలు వసూలు చేసుకునే అధికారం దఖలు చేయబడుతుందని అన్నారు.

బహిరంగ విచారణ జరిపి, సమాచారాన్ని ప్రజల ముందు ఉంచుతారనే నమ్మకం లేదని పేర్కొన్నారు. ఖర్చులు పెరిగాయనే సాకుతో సర్దుబాటు ఛార్జీల భారాన్ని వినియోగదారులపై ప్రతినెలా వేయటానికి నిబంధనలను సవరించడం గర్హనీయమని తెలిపారు. తెలంగాణ యూనిట్‌కు 30 పైసలు నిర్ణయిస్తే రాష్ట్రంలో 50 పైసలు నిర్ణయించడం దారుణమని అన్నారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీల విధానమే సరికాదని, ప్రజలకు తగిన సమాచారం చెప్పకుండా, పారదర్శకత లేకుండా ఇష్టారాజ్యంగా ప్రతిపాదిస్తున్నారని విమర్శించారు. సరైన విచారణ జరపకుండా, ప్రజల అభ్యంతరాలను గుర్తించకుండా అధిక భారాన్ని మోపటానికి అనేక సందర్భాల్లో అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ విద్యుత్, ఇతర సబ్సిడీతో అందించే విద్యుత్‌కు అయిన ఖర్చులను కూడా ప్రభుత్వం భరించకుండా వినియోగదారులపైనే భారం మోపుతుందని తెలిపారు. ఈ సర్దుబాటు ఛార్జీల ప్రమాదాన్ని ప్రజలు, వినియోగదారులు గుర్తించి ఎదుర్కోవాలని, ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు.


కర్నూలు బాలోత్సవం ప్రారంభ సభలో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి

కర్నూలులో బాలోత్సవం ప్రారంభం

- నైపుణ్యాల ప్రదర్శనకు మంచి వేదిక : డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో సోమవారం బాలోత్సవం ప్రారంభమైంది. తొలిరోజు పిల్లల పండుగ కన్నులపండుగగా సాగింది. మొత్తం 1200 మంది విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. తొలుత మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత కల్యాణమ్మ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను డిఇఒ రంగారెడ్డి, బాలోత్సవం జెండాను రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో డిఇఒ రంగారెడ్డి మాట్లాడుతూ పిల్లలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇది మంచి వేదికని తెలిపారు. బాలలకు ఇష్టమైన వాటిని ప్రదర్శించడం, ఇతర ప్రదర్శనలు తిలకించడమే బాలల ఉత్సవమని అన్నారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడి లేకుండా చదువుకునే అవకాశం కల్పించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. జానపద, క్లాసికల్ నృత్యాలు, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణతో చిన్నారులు అలరించారు. చిన్నారులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాల జిల్లా అధ్యక్షులు పివిబి సుబ్బయ్య, యుటిఎస్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, కర్నూలు బాలోత్సవం కార్యదర్శి జెఎన్ శేషయ్య, కన్వీనర్లు కెంగార మోహన్, ఎంపి బసవరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళల మృతి

ప్రజాశక్తి - చేబ్రోలు (గుంటూరు జిల్లా)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం పాలైన ఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చుండూరు మండలం దుండుపాలెం నుండి 11 మంది కూలీలు ఆటోలో చేబ్రోలు మండలం నారాకోడూరులో చిక్కుడు కాయల కోతకు సోమవారం ఉదయం బయలుదేరారు. వేరొక వాహనం జనరేటర్‌తో తెనాలికి వెళుతోంది. చేబ్రోలు మండలం గరువుపాలెంలోని చాణక్య పాఠశాల సమీపంలో జనరేటర్‌కు ఏర్పాటు చేసిన లింకులు ఊడిపోవడంతో ఆ వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కూలీల ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. అందులోని పిట్టు వెంకట రమణ (46), తుమ్మ సామ్రాజ్యం (30) అక్కడికక్కడే మరణించారు. మరో తొమ్మిదిమందికి గాయాలపాలయ్యారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను వడ్లమూడిలోని డివిసి హాస్పిటల్‌కు తరలించారు. జె మరియమ్మకు తీవ్ర గాయాలవడంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. జనరేటర్‌ను తరలిస్తున్న వాహన డ్రైవర్ కంకణాల నాంచారయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేబ్రోలు ఎస్ఐ కె ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా క్షతగాత్రుల్లో కొందరిని తొలుత తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా సిఎం పర్యటన నేపథ్యంలో అక్కడ వైద్యం వీలవదని డివిసి ఆస్పత్రికి తరలించారు.

రేణిగుంట పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- రేణిగుంట:

తిరుపతి జిల్లా రేణిగుంట పారిశ్రామికవాడలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని మొదటి అంతస్థులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డేటా కేబుల్ తయారీ పరిశ్రమ కావడంతో వేగంగా మంటలు వ్యాప్తి చెంది భవనం మొత్తం దట్టమైన పొగ విస్తరించింది. దీంతో ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. ఫ్యాక్టరీ సెక్యూరిటీ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మూడు అగ్నిమాపక వాహనాలతో వచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మొదటిఅంతస్థు పూర్తిగా దగ్ధం కాగా మిగిలిన అంతస్థులన్నీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదంలో రూ.20 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. అగ్నిప్రమాదం సమయంలో ఫ్యాక్టరీలో 200 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయం కావడం వల్ల సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని పోలీసులు భావిస్తున్నారు.

'మీ సేవ'ను పునరుద్ధరిస్తాం

- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

టిడిపి ప్రభుత్వ హయాంలో మీసేవ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీసేవను మరింత పటిష్టం చేసి పథకాల అమలు, వివిధరకాల సర్టిఫికెట్ల జారీలో జాప్యాన్ని నివారిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీనిచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన యాత్ర తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శివగిరి నుంచి సోమవారం ప్రారంభమైంది. తొండవాడలో యువగళం పాదయాత్రకు మీసేవ మిత్రలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను లోకేష్‌కు వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో నాణ్యమైన, మెరుగైన సేవలందించినందుకు గత ప్రభుత్వ హయాంలో తమకు ఎన్నో అవార్డులు వచ్చాయని,తాము అందించిన సేవలను మోడల్‌గా తీసుకుని తమిళనాడులో ఇ-సేవ, కర్ణాటకలో బెంగుళూరు ప్లస్ పేరుతో మీసేవ విధానాన్ని అమలులోకి తెచ్చారని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మీసేవను పూర్తిగా చంపేసిందని, ప్రజలను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే విధానానికి తెరలేపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తొండవాడలో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ..ఆన్‌లైన్ విధానం ద్వారా తమ ఆటలు సాగవనే ఉద్దేశంతో మీసేవలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇసుక, మద్యం అమ్మకాల్లో నగదు చెల్లింపుల విధానం ద్వారా వేలకోట్ల రూపాయల దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. అప్పర్ తుంగభద్ర కడితే రాయలసీమ రాళ్ల సీమవుతుందని.. అయినా వైసిపి ఎంపిలు ఢిల్లీలో నోరు మెదపడం లేదన్నారు.అనంతరం శానంబట్ల గ్రామంలో స్థానికులతో మాటామంతీ నిర్వహించారు. యాత్ర పిచ్చినాయుడుపల్లి, తొండవాడ, చంద్రగిరి టవర్‌క్లాక్ మీదుగా మామందురుకు చేరుకుంది. మంగళవారం మామందురు నుంచి యాత్ర ప్రారంభం కానుంది.


ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

మైనింగ్ ప్రాజెక్టులకు సింగిల్ విండో క్లియరెన్స్

- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం ప్రభుత్వ ముసాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అపారంగా ఖనిజ సంపద ఉందని, ఇక్కడ మైనింగ్ ప్రాజెక్టులను చేపట్టే వారికోసం సింగిల్ విండో క్లియరెన్స్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ కోసం మైనింగ్ అండ్ మినరల్స్ ముసాయిదా పత్రాన్ని సోమవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి ఎంతో అనువైందిగా పేర్కొంది. దేశంలో ప్రముఖ ఇండస్ట్రియల్ కారిడార్లు విశాఖ-చెన్నై, బెంగళూరు-హైదరాబాద్, చెన్నై-బెంగళూరు ఎక్కువగా రాష్ట్రంలోనే ఉన్నాయని తెలిపింది. రాష్ట్రంలో ముందువచ్చిన సంస్థలకు ముందు మైనింగ్‌ను ఇవ్వాలనే నిబంధనకు కట్టుబడి ఉందని పేర్కొంది. వ్యవసాయ, ఆక్వా రంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మంచి పురోగతి సాధించిందని తెలిపింది. మైనింగ్‌లో స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించేందుకు అన్ని రకాలుగా అవకాశాలున్నాయని పేర్కొంది. బాక్సైట్ నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, బీచ్ సాండ్, మెటల్‌గ్రేడ్ టైటానియం వంటి ఏరోస్పేస్, డిఫెన్స్‌లో వినియోగించే ఖనిజాలు 6 వేల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయని తెలిపింది. మినరల్స్, మైనింగ్‌లో కూడా పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయంది. పర్యావరణ అనుమతుల ఆధారంగా పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 40 దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్‌తోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి అన్బురాజన్ విలేకరుల సమావేశం నిర్వహించి, ఈ వివరాలను వెల్లడించారు. కొండాపురం మండలం తాడిపత్రి- ముద్దనూరు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న చీని, నిమ్మ తోటల్లో కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను వాహనంలో లోడ్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీసులు దాడి చేశారు. అంతర్రాష్ట్ర స్మగ్లర్ భాస్కర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, తుపాకుల ఖాదర్ బాషా, లక్ష్మీనారాయణ రెడ్డి, రాజేంద్రను అరెస్టు చేశారు. మరో ఐదుగురు స్మగ్లర్లు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి 40 ఎర్రచందనం దుంగలు, స్కార్పియో వాహనం, నాలుగు మోటార్ సైకిల్స్, ఓ ఎలక్ట్రానిక్ వెల్డింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. 2007 నుంచి భాస్కర్‌రెడ్డిపై పది ఎర్రచందనం దొంగతనం కేసులు నమోదయ్యాయని ఎస్‌పి తెలిపారు.

ఎయిర్‌టెల్‌కు కోటి 5జి వినియోగదారులు

న్యూఢిల్లీ : కోటి మంది 5జి వినియోగదారుల మైలురాయిని చేరినట్లు ప్రముఖ ప్రయివేటు టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఈ సేవలను ప్రారంభించిన కొన్ని నెలల్లోనే ఈ స్థాయికి చేరడం ఎంతో సంతోషంగా ఉందని ఆ కంపెనీ పేర్కొంది. మార్చి 2024 కల్లా దేశంలోని ప్రతీ పట్టణంలో, కీలక గ్రామీణ ప్రాంతాల్లో 5జి సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబర్ 1న ఈ సేవలు ప్రారంభించింది.

నా ఇల్లు, స్థలం

కబ్జాకు ప్రయత్నిస్తున్నారు

- కలెక్టరేట్ భవనం ఎక్కి మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి


కలెక్టరేట్ భవనంపైకి ఎక్కిన మహిళ

కాకినాడలోని కలెక్టరేట్ భవనం పైకి ఎక్కిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి దుర్గాదేవి, రాంబాబు దంపతులు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చారు. తమ స్థలం, ఇల్లు కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని దుర్గాదేవి కలెక్టరేట్ భవనం పైకి ఎక్కారు. తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆత్మహత్యకు పాల్పడతానంటూ నినదించారు. పోలీసులు స్పందించి ఆమెను కిందకు తీసుకువచ్చి, కలెక్టర్ కృతికాశుక్లా వద్దకు తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం దుర్గాదేవి దంపతులు మీడియాతో మాట్లాడారు. తమకు రాజమహేంద్రవరంలో పెంకుటిల్లు, 1,200 గజాల స్థలం ఉందన్నారు. వీటి విలువ సుమారు రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. ఫోర్జరీ సంతకాలతో తమ ఆస్తిని కాజేసేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి, తమ కుటుంబ సభ్యులతో కలిసి మోసం చేస్తున్నారని వాపోయారు. తమను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపం చెంది కలెక్టరేట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని దుర్గాదేవి తెలిపారు.

మా నాన్నే నాకు స్ఫూర్తి..

- దేశానికి - ప్రజలకు సేవ చేయడమే రాజకీయం : రవీంద్ర
- తెలుగు రెండు రాష్ట్రాల్లో గుజ్జుల ఎల్లమందరెడ్డి శత జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-ఒంగోలు

సిపిఐ అగ్ర నాయకులు గుజ్జుల ఎల్లమందరెడ్డి స్ఫూర్తితోనే జర్మనీలోని ఆగ్స్‌బర్గ్ రాష్ట్రంలో రాజకీయంగా ముందుకు సాగుతున్నానని ఆయన కుమారుడు రవీంద్ర పేర్కొన్నారు. ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో సోమవారం కీర్తిశేషులు గుజ్జుల ఎల్లమందరెడ్డి సరళ దేవి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో రవీంద్ర మాట్లాడారు. చదువు కోసం జర్మనీ వెళ్లి అక్కడే డాక్టర్ వృత్తిలో స్థిరపడి పెళ్లి చేసుకున్నానని తెలిపారు. ప్రస్తుతం ఆగ్స్‌బర్గ్ రాష్ట్రంలో మేయర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ముందుగా ఎంపిగా ఎన్నికై తరువాత వరుసగా ఐదుసార్లు మేయర్‌గా ఎన్నిక అయ్యానని తెలిపారు. ఒక భారతీయునిగా జర్మనీలో రాజకీయాల్లోనూ మంచి పేరు తెచ్చుకున్నానంటే దానికి కారణం తన తండ్రి గుజ్జుల ఎలమందరెడ్డి స్ఫూర్తేనని అన్నారు. తన తండ్రి కనిగిరి ఎమ్మెల్యేగా మూడుసార్లు, ఎంపిగా ఒకసారి గెలుపొందిన విషయాన్ని గుర్తు చేశారు. తన తండ్రి రాజకీయ నాయకుడిగా ఉన్నప్పుడు ఉన్న రాజకీయాలకు ఇప్పుడు మన దేశంలో ఉన్న రాజకీయాలకు ఏమాత్రమూ పొంతన లేదన్నారు. ఈ రోజుకు కనిగిరిలో తమకు సొంతిల్లైనా లేదని తెలిపారు. తమ తల్లిదండ్రుల పేరుతో తెలుగు రెండు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. యల్లమందరెడ్డి శత జయంతి ఉత్సవాలను తెలుగు రెండు రాష్ట్రాల్లో నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. రవీంద్ర భార్య గాబి గుజ్జుల, సిపిఐ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు. అనంతరం గుజ్జుల రవీంద్ర దంపతులను సిపిఐ శ్రేణులు ఘనంగా సత్కరించాయి.

బిజెపి రాష్ట్ర కార్యాలయం ఎదుట 'ఆప్' నిరసన

- తిరుపతిలో సోము వీర్రాజు కాన్వాయ్ అడ్డగింత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో / తిరుపతి బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన విద్యాశాఖ మంత్రి మనీశ్ సిసోడియాను సిబిఐ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ.. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్ర కన్వీనరు పోతన వెంకట రామారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసోడియాను తక్షణమే విడుదల చేయాలని ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న 11 మంది ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి, నగరంలోని సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సోము వీర్రాజుకు చేదు అనుభవం

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుకు తిరుపతిలో చేదు అనుభవం ఎదురైంది. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు ఆయనను అడ్డుకున్నారు. తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల కార్యకర్తలు బైరాగిపట్టెడలోని బాబూ జగ్జీవన్‌రావు పార్కు నుంచి రాఘవేంద్ర నగర్‌లోని బిజెపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ సోము వీర్రాజుకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు. ఇంతలోనే బిజెపి నేతలు ఆప్ కార్యకర్తల ప్లకార్డులు, జెండాలు, బ్యానర్లు చించేశారు. దీంతో సోము వీర్రాజు కాన్వాయిని ఆప్ కార్యకర్తలు అడ్డగించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 207 | విజయవాడ, మంగళవారం 28 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 28 February 2023 | Rs

నేపాల్‌లో మళ్లీ సంక్షోభం

- ప్రభుత్వానికి ఒలి పార్టీ మద్దతు ఉపసంహరణ

• లోపలి పేజీలో.. •



'శాంతి కోసం తిరుగుబాటు' పేరుతో బెర్లిన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న జర్మన్లు

• లోపలి పేజీలో.. •



రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను తిలకిస్తున్న మంత్రి బొత్స

ఇకపై స్మార్ట్ క్లాస్ రూమ్స్

- విద్యారంగ సంస్కరణల్లో మన రాష్ట్రమే ఫస్ట్
- ర్యాగింగ్ నిరోధానికి చర్యలు
- రాష్ట్ర సైన్స్ ఎగ్జిబిషన్‌లో మంత్రి బొత్స

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

వచ్చే ఏడాది నుంచి స్మార్ట్ క్లాస్ రూములు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో పలు సంస్కరణలు తీసుకొచ్చి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. విద్యా సంస్థల్లో ర్యాగింగ్ నిరోధానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజీలో రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ పిల్లలకు ఇచ్చే ఆస్తి విద్య ఒక్కటే అనే విధానంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా విద్యా రంగంలో కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా మొదట మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి తరగతి గదిలో స్మార్ట్ టివిలు ఏర్పాటు చేస్తామని, గెస్ట్ లెక్చరర్స్ ఇప్పిస్తామని అన్నారు. మన రాష్ట్రంలో ఢిల్లీని మించిన విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషిద్ధమని తెలిపారు. ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది ఉన్నా అధ్యాపకులకు చెప్పాలని సూచించారు. ఇప్పటికే పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్య వరకు ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్, సమగ్రశిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక సదస్సులో 26 జిల్లాలకు చెందిన ఒక్కో స్కూలు నుంచి పది మంది విద్యార్థుల చొప్పున మొత్తం 260 మంది పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మొత్తం 713 అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయన్నారు. వాటిలో రూ.10 లక్షల విలువైన సైన్స్ పరికరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎస్‌ఇఆర్‌టి డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

నాగాలాండ్‌లో 84 శాతం మేఘాలయలో 77.5 శాతం

- 2న ఓట్ల లెక్కింపు

కొహిమా, షిల్లాంగ్ : మేఘాలయ, నాగాలాండ్‌లలో సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పోలింగ్ శాతం నమోదైంది. మేఘలాయలో 77.5 శాతం, నాగాలాండ్‌లో 84 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. భారీ భద్రత నడుమ ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 4 గంటలకు వరకూ జరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ చెరొక 60 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, 59 స్థానాలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. మేఘాలయ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఫ్రెడ్రిక్ రాయ్ రాత్రి 7:30 గంటలకు మాట్లాడుతూ ప్రస్తుతానికి 77.55 శాతం పోలింగ్ నమోదయిం దని, తుది సమాచారం వచ్చిన తరువాత ఈ సంఖ్య 2018 ఎన్నికల పోలింగ్ శాతం (85.59 శాతం)ను సమీపిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. నాగాలాండ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వి.శకాంక్ శేఖర్ మాట్లాడుతూ 84.8 శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. మేఘాలయలో మొత్తం 21.61 లక్షల ఓట్లు ఉండగా, నాగాలాండ్‌లో 13.17 లక్షల ఓట్లర్లు ఉన్నారు. నాగాలాండ్‌లో వోఖా జిల్లాలోని భండారి నియోజకవర్గంలోని అకుక్ గ్రామంలో జరిగిన ఘర్షణలో ముగ్గురు గాయపడ్డారు. ఒక అభ్యర్థికి చెందిన మద్దతుదారులు మరొక అభ్యర్థికి చెందిన మద్దతుదారులపై దాడికి దిగడంతో ఈ ఘర్షణ జరిగింది. మేఘాలయలో బిజెపికి ఒక స్థానాన్ని ఏకగ్రీవంగా గెలుచుకోవడం, నాగాలాండ్‌లో ఒక అభ్యర్థి మరణించడంతోనూ రెండు రాష్ట్రాల్లోనూ 59 స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. నాగాలాండ్‌లో 183 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, మేఘాలయలో 369 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ రెండు రాష్ట్రాలతోపాటు త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మార్చి 2న ప్రకటించనున్నారు సోమవారం తమిళనాడులోని ఈరోడ్ (తూర్పు), పశ్చిమబెంగాల్‌లోని సగర్దిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరణించడం, జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడ్డంతో ఉప ఎన్నికలు జరిగాయి.

సిబిఐ కస్టడీకి సిసోడియా

దేశ వ్యాప్తంగా ఆప్ ఆందోళనలు

న్యూఢిల్లీ : లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను ఐదు రోజుల సిబిఐ కస్టడికి కోర్టు అనుమతించింది. సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది కోర్టు ఆదేశాలతో మార్చి 4వ తేది వరకు ఆయన సిబిఐ కస్టడిలో ఉండనున్నారు. ఆదివారం అరెస్ట్ చేసిన సిసోడియాను సిబిఐ అధికారులు భారీ బందోబస్తు నడుమ సోమవారం మధ్యాహ్నం ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. తాము దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఒకటవ నెంబర్ నిందితుడిగా సిసోడియాను పేర్కొన్నట్లు కోర్టుకు తెలిపారు. విచారణ సమయంలో తమ ప్రశ్నలకు దాటవేత వైఖరితో వ్యవహరించారని అన్నారు. ఈ నేపథ్యంలోనే కస్టడీ కోరుతున్నట్లు తెలిపారు. అయితే, సిబిఐ విజ్ఞప్తిని సిసోడియా తరపు న్యాయవాది వ్యతిరేకించారు. సిసోడియాకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని కోర్టుకు తెలిపారు. సిసోడియా ఆర్థిక మంత్రి. బడ్జెట్‌ను సమర్పించాల్సిఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరువైపులా వాదనలు విన్నతరువాత ఐదు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. మరోవైపు సిసోడియా అరెస్టును నిరసిస్తూ ఆప్ మద్దతుదారులు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. పలు ప్రతిపక్షపార్టీలు ఈ చర్యను ఖండించాయి. విజయవాడలోని బిజెపి కార్యాలయం వద్ద ఆప్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తిరుపతి పర్యటనలో ఉన్న బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. ఆయన కారుకు ఎదురుగుండా రోడ్డుపై భైఠాయించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సివచ్చింది. ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ఆప్ కార్యకర్తలు నిరసన తెలిపారు. వీరిని చెదరగొట్టేందుకు భద్రతా సిబ్బంది లాఠీచార్జి చేశారు. పలువురు ఆప్ మద్దతుదారులను పారామిలటరీ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. శ్రీనగర్‌లో మార్చ్ చేయడానికి ఆప్ కార్యకర్తలు



చేసిన ప్రయతాన్ని జమ్ముకాశ్మీర్ పోలీసులు భగ్నం చేశారు. ముంబయిలోని బిజెపి కార్యాలయం వెలుపుల నిరసన చేయడానికి వెళుతున్న ఆప్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఛండీగఢ్‌లోనూ ఆప్ ఆందోళనలు నిర్వహించిది. తెలంగాణలోనూ పలు చోట్ల ఆందోళనలు నిర్వహించారు. హైదరాబాద్‌లో బిజెపి కార్యాలయం వద్దకు వెళ్లడానికి ప్రయత్నించడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లోనూ ఆందోళనలు జరిగాయి. ఢిల్లీలో తమ పార్టీకి చెందిన 80 శాతం నేతలను పోలీసులు అరెస్ట్ చేశారని ఆప్ ప్రకటించింది.

రాజకీయ ఒత్తిళ్లతోనే... కేజ్రీవాల్

సిబిఐ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతోనే సిసోడియాను అరెస్ట్ చేశారని ఢిల్లీ సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. సిబిఐ అధికారుల్లోనే పలువురు ఈ చర్యను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు రాజకీయ బాస్‌లకు విధేయత చూపాల్సి వచ్చిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంపై దాడి : పినరయి విజయ్

ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అరెస్టును ప్రజాస్వామ్యంపై దాడిగా కేరళ సిఎం పినరయి విజయన్ అభివర్ణించారు. ప్రతిపక్ష పార్టీలను భయపెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నారన్న దానికి ఇదో ఉదాహరణ అని చెప్పారు. ఇలాంటి అణచివేత మన దేశ పునాదిని దెబ్బతీస్తుందని అన్నారు.

దృష్టి మరల్చేందుకే : కెసిఆర్

ప్రధానమంత్రి మోడీ, అదానీ మధ్య ఉన్న సంబంధాలనుండి దేశ ప్రజల దృష్టి మరల్చేందుకే సిసోడియాను అరెస్ట్ చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్వీట్ చేసిన ఆయన సిసోడియా అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

సిపిఎం ఖండన

ఢిల్లీ : ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను సిబిఐ అరెస్టు చేయడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో ఖండించింది. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఆయుధాలుగా మార్చే మోడీ ప్రభుత్వ ప్రాజెక్టులో సిసోడియా అరెస్టు ఒక భాగమని పేర్కొంది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ నాయకులకు వ్యతిరేకంగా కేసులు పెట్టడం, అరెస్టు చేయడం, ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను అస్థిరపరచడం వంటివి జరుగుతున్నాయని తెలిపింది. ప్రజాస్వామిక పద్ధతుల్లో ఎన్నికల్లో గెలవలేక ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని మోడీ సర్కారు కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతోందని విమర్శించింది.

ప్రధాని, అధికార పార్టీలకు, అదానీ తదితర దాని అనుకూల బడా వ్యాపార సంస్థలకు మధ్య సంబంధాల విషయం చర్చనీయాంశం కావడం, అనేక ప్రశ్నలు ఎదురవుతుండడంతో వాటి నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రతిపక్ష నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొంది.

చకచకా గ్లోబల్ సదస్సు ఏర్పాట్లు

- ప్రతిష్టాత్మకంగా తీసుకోండి : సిఎం
- పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్శిటీ గ్రౌండ్స్‌లో మార్చి 3,4 తేదీల్లో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. అధికారయంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమైంది. సదస్సుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడటంతో పాటు, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా చూడటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి పలుమార్లు అధికారయంత్రాంగానికి దిశా నిర్దేశం చేయగా, తాజాగా సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఈ సమావేశంలో ఆయన ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న అన్ని రకాల ప్రోత్సహకాలకు సంబంధించి పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. 3వ తేది దయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సదస్సు జరిగే రెండు రోజులూ విశాఖలోనే ఉండనున్నట్లు సమాచారం. వివిధ పారిశ్రామిక రంగాలపై జరిగే సెషన్లలో సిఎం స్వయంగా పాల్గొనడంతో పాటు, పారిశ్రామిక వేత్తలతో ఆయన నేరుగా చర్చలు జరపనున్నారు. మొదటి రోజు జరిగే విందులో కూడా సిఎం పారిశ్రామిక వేత్తలతో కలిసి భాగస్వాములు కానున్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమలశాఖ స్పెషల్ సిఎస్ కరికాలవళవన్, ఆర్థికశాఖ స్పెషల్ సిఎస్ ఎస్ఎస్‌రావత్, సమాచారశాఖ కమిషనరు టి. విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. త్రివేణి గ్లాస్ లిమిటెడ్ ఎండి వరుణ్ గుప్తా ముఖ్యమంత్రితో సోమవారం సాయంత్రం భేటీ అయ్యారు. తూర్పుగోదావరిజిల్లా పంగిడిలో వెయ్యి కోట్ల మూలధన పెట్టుబడితో రోజుకు 840 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సోలార్ గ్లాస్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు సంబంధించి అధికారులతో సమీక్షా నిర్వహిస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి

నేడు రైతు భరోసా మూడో విడత

- తెనాలిలో బటన్ నొక్కనున్న సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ మూడో విడత నగదు రైతుల ఖాతాల్లో మంగళవారం జమకానుంది. దీంతోపాటు ఇటీవల పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి ఈ రెండు నగదులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ రెండు విడతల్లో రూ.11,500 నగదును రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమచేసింది. మంగళవారం మూడో విడతలో రూ.2 వేలను రైతుల ఖాతాల్లో జమకానుంది. రాష్ట్రంలో 51.12 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.1090.76 కోట్లను జగన్ బటన్ నొక్కి జమచేయనున్నారు. 2022 డిసెంబర్‌లో మాండోస్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల పంట నష్టంతోపాటు నేల కోత, ఇసుక మేటల కారణంగా నష్టపోయిన 91,237 మంది రైతులకు రూ.76.99 కోట్లను వారి ఖాతాల్లో జమచేయనున్నారు.

23న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఎపిలో 7, తెలంగాణలో 3 స్థానాలకు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 23న జరగనున్నాయి. అదేరోజు పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 29తో పదవీకాలం ముగియనుంది. దీంతో ఆయా స్థానాలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎమ్మెల్సీలు చల్లా భగీరత్ రెడ్డి (2022 నవంబర్ 2 నుంచి ఖాళీ), నారా లోకేష్, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, డొక్కా మాణిక్య వరప్రసాదరావు, పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు, గంగుల ప్రభాకర్ రెడ్డి పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. అలాగే తెలంగాణలో ఎమ్మెల్సీలు అలిమినేటి కృష్ణారెడ్డి, వూళ్ళోల్ల గంగాధర్ గౌడ్, కూర్మయ్యగారి నవీన్ కుమార్ పదవీకాలం కూడా మార్చి 29తో ముగియనుంది.

నోటిఫికేషన్	మార్చి 6
నామినేషన్లకు గడువు	మార్చి 13
నామినేషన్ల పరిశీలన	మార్చి 14
నామినేషన్ల ఉపసంహరణ	మార్చి 16
పోలింగ్	మార్చి 23
ఓట్ల లెక్కింపు	మార్చి 23

పోలింగ్ సమయం : ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు

ఐదు స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

• లోపలి పేజీలో.. •

రాజధాని అమరావతిపై మార్చి 28న విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రాష్ట్ర రాజధాని అమరావతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. రాజధానిపై పిటిషన్లను త్వరగా విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం కోరింది. త్వరగా వాదనలు ముగించాలని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ధర్మాసనం ముందు ఎపి ప్రభుత్వం తరపున న్యాయవాదులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. స్పందించిన సుప్రీం ధర్మాసనం.. ఆ పిటిషన్లపై మార్చి 28న విచారణ చేపడతామని స్పష్టం చేసింది. అమరావతిపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు రైతులు, అమరావతి పరిరక్షణ సమితి, ఇతరులు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసుల విచారణ ఈ నెల 23న సుప్రీం కోర్టులో విచారణ చేపట్టాల్సి ఉంది. అయితే ఒకసారి నోటీసు అయిన అంశాలను బుధ, గురువారాల్లో విచారించబోమంటూ ఈ నెల 14న సుప్రీం కోర్టు సర్క్యులర్ జారీ చేసింది. ఆ నేపథ్యంలో గత 23న రాజధాని కేసులు విచారణకు రాలేదు. అమరావతి కేసుల అంశాన్ని జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి ప్రస్తావించారు. సుప్రీం కోర్టు సర్క్యులర్ ప్రకారం గత గురువారం కేసులు విచారణకు రాలేదని, కోర్టుకు హోలీ సెలవుల అనంతరం (మార్చి 11న) వెంటనే విచారణ జాబితాలో చేర్చాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. వాదనలకు ఎంత సమయం తీసుకుంటారని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకరోజు సమయం పడుతుందని నిరంజన్ రెడ్డి బదులిచ్చారు. మార్చి 28న కేసుల విచారణ చేపడతామని ధర్మాసనం ప్రకటించింది.

కోర్టు ఆదేశాలు పాటించరా?

ఒఆర్ఒపి కేసులో కేంద్రంపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : 'వన్ ర్యాంక్... వన్ పెన్షన్ (ఒఆర్ఒపి)కి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల్ని పాటించరా? ఇదేం పద్ధతి?' అంటూ కేంద్ర ప్రభుత్వ తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. "కోర్టు ధిక్కారణ నోటీసులు పంపాల్సి ఉంటుంది" అంటూ రక్షణ శాఖను హెచ్చరించింది. సైనిక బలగాలకు చెందిన అర్హులైన పెన్షన్‌దారులకు ఒఆర్ఒపి బకాయిల్ని ఒకే విడతలో చెల్లించాలని, మార్చి 15కల్లా చెల్లింపుల ప్రక్రియ పూర్తిచేయాలని జనవరి 9న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పును పరిగణలోకి తీసుకోకుండా పెన్షన్‌దారులకు నాలుగు విడతల్లో బకాయిలు చెల్లించబోతున్నామని జనవరి 20న రక్షణశాఖ ఒక నోటిఫికేషన్ జారీచేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం 'ఒఆర్ఒపీ' కేసుపై విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వుల్ని ధిక్కరిస్తూ రక్షణశాఖ నోటిఫికేషన్ జారీచేయటం ఏంటని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. నోటిఫికేషన్‌ను రద్దు చేయకపోతే కోర్టు ధిక్కారణ నోటీసులు పంపాల్సి ఉంటుందని హెచ్చరించింది. "సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఒఆర్ఒపి కేసులో అర్హులైన పెన్షనదారులకు బకాయిల్ని చెల్లించాలి. కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాక కూడా.. నాలుగు వాయిదాల్లో బకాయిలు చెల్లిస్తామని రక్షణ శాఖ ఎలా నిర్ణయించింది?" అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ హోలి పండుగ తర్వాత చేపడతామని కేసును వాయిదా వేసింది.

జనవరి 9 నాటి సుప్రీం విచారణకు కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంటకరమణి హాజరయ్యారు. "వ్యక్తిగతంగా ఈ అంశాన్ని పరిశీలిస్తాను. వీలైనంత త్వరలో బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటా"మని న్యాయస్థానానికి ఆయన హామీ ఇచ్చారు. కేంద్రం కోరిన మీదట సుప్రీంకోర్టు బకాయిల చెల్లింపు గడువు ఇప్పటికే రెండుమార్లు పొడగించింది.

లక్షలాది కుటుంబాలకు సంబంధించినది : మాజీ సైనికాధికారులు

సైనిక బలగాల్లో పనిచేసి రిటైర్ అయినవారి ర్యాంక్, సర్వీస్ కాల వ్యవధిని మాత్రమే లెక్కలోకి తీసుకొని పెన్షన్ నిర్ణయించాలన్నదే 'ఒఆర్ఒపీ'. రిటైర్ అయిన తేదీని బట్టి పెన్షన్ నిర్ణయించరాదని 'ఒఆర్ఒపీ' చెబుతోంది. జులై 1, 2014 నుంచి ఒఆర్ఒపీ అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి ఐదేండ్లకోమారు పెన్షన్ చెల్లింపులో సవరణలు ఉంటాయి. అర్హులైన పెన్షన్‌దారుల బకాయిల చెల్లింపు ప్రక్రియ మూడు నెలల్లోగా పూర్తిచేయాలని గతంలో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది. తమకు రావాల్సిన బకాయిల్ని ఒకే విడతలో చెల్లించాలని కోరుతూ కొంతమంది మాజీ సైనికాధికారుల బృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణ పెండింగ్‌లో ఉండిపోవటంతో ఈ సమయంలో దాదాపు 4లక్షల మంది పెన్షనర్లు చనిపోయారని, దీనివల్ల అనేక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని సుప్రీం ముందు వారు గోడువెళ్లబోసుకున్నారు. దీంతో ఈ అంశంపై విచారణ పూర్తిచేసిన సుప్రీంకోర్టు జనవరి 9న తీర్పు వెలువరించింది. పెన్షన్‌దారులకు ఒకే విడతలో బకాయిలు చెల్లించాలని చెప్పింది.

5నే నీట్ పిజి పరీక్ష

- సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : మార్చి 5వ తేదీన నీట్ - పోస్ట్‌గ్రాడ్యుయేట్ (నీట్ పిజి) 2023 పరీక్ష జరగనుంది. ఈ పరీక్షను ఏప్రిల్ లేదా మేకు వాయిదా వేయాలని కొంత మంది వైద్య విద్యార్థులు దాఖలు చేసిన పిటీషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఇంటర్న్‌షిప్‌కు కటాఫ్ తేదిని పొడిగించడంతో పరీక్షకు సిద్ధం కావడానికి తగిన సమయం దొరకలేదని పిటీషన్‌లో విద్యార్థులు పేర్కొన్నారు. తేదీని పోడించడానికి ముందే సుమారు 2.03 లక్ష మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, తరువాత ఆరు వేల మంది విద్యార్థులే దరఖాస్తు చేసుకున్నారని ఎసిజి ఐశ్వర్యభాతి కోర్టుకు తెలిపారు. పరీక్ష కోసం సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని, ఈ సమయంలో వాయిదా వేయడం వారందరికి 'మానసిక క్షోభ'కు కారణమవుతుందని జస్టిస్ ఎస్ఆర్ భట్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇంటర్న్‌షిప్ ఇంకా పూర్తి చేయని అభ్యర్థులు తరువాత సందర్భానుసారంగా వ్యవహరించబడతారని తెలిపింది. పరీక్ష వాయిదాను సుప్రీంకోర్టు తిరస్కరించడంతో నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇ) అభ్యర్థుల అడ్మిట్ కార్డులను సోమవారం నుంచి విడుదల ప్రారంభించింది. అభ్యర్థులు ఎన్‌బిఇ అధికారిక వైబ్‌సైట్ నుంచి తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

సంపాదకీయం

కార్పొరేట్ దోపిడీకి దన్ను

పవర్ ఎక్స్ఛేంజిలో విద్యుత్ అమ్మకపు ధర గరిష్ట పరిమితి యూనిట్‌కు రూ.50 గా కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సిఇఆర్‌సి) నిర్ణయించడం ప్రజలకు పెనుభారం. ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలతో ఇప్పటికే ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న పంపిణీ సంస్థల (డిస్కం)కు శరాఘాతం. ధర గరిష్ట పరిమితి ఇప్పుడున్న రూ.12 నుంచి ఎకాయెకిన రూ.50 చేయడం ప్రైవేటు విద్యుత్ కంపెనీల ఒత్తిడి మేరకే జరిగింది. కార్పొరేట్ల లాభాల కోసం పరితపిస్తున్న మోడీ ప్రభుత్వ కనుసన్నల్లోనే సిఇఆర్‌సి ధర పెంచి ఇండియా ఎనర్జీ ఎక్స్ఛేంజికి అనుమతిచ్చింది. సాధారణంగా ప్రతి ఏడాదీ వేసవిలో పవర్‌కు డిమాండ్ ఏర్పడుతుంది. సరిగ్గా వేసవి ముంగిట ధర పెంచడం కార్పొరేట్లకు కాసులు పోగేసుకునే వెసులుబాటు కల్పించడమే. నిరుడు వేసవిలో దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిసిటీకి భారీ డిమాండ్ నెలకొనగా యూనిట్ రూ.20 దాటిపోయింది. పలు డిస్కంలు అంతపెట్టి కొనలేక చేతులెత్తేశాయి. ఆ సమయంలో జోక్యం చేసుకున్న సిఇఆర్‌సి రూ.12 పరిమితి విధించింది. ఇప్పుడా పరిమితిని ఏకంగా రూ.50 చేసింది. రూ.12 ధర తమకు గిట్టుబాటు కావడం లేదని అదానీ, రత్నగిరి సహా ప్రైవేటు సంస్థలు పట్టుబట్టిన దరిమిలా ఎనర్జీ ఎక్స్ఛేంజి సిఇఆర్‌సిని ధర పెంచాలని కోరింది. విచారించిన సిఇఆర్‌సి అమ్మకపు ధర పరిమితి రూ.50కి పెంచింది.

దిగుమతి చేసుకునే బొగ్గు, గ్యాస్, బ్యాటరీ ఆధారిత పవర్‌కే పెంచిన ధర పరిమితి వర్తిస్తుందని సిఇఆర్‌సి ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ భవిష్యత్తులో డిస్కంలు అపరిమిత భారాలు మోయాల్సే ఉంటుంది. ఎక్కువ ధరలకు కరెంట్ కొనుగోలు చేస్తే ఆ భారాలు ట్రూఅప్, శ్లాబుల్లో మతలబుల వంటి రూపాల్లో వినియోగదారుల నెత్తినే పడతాయి. ప్రస్తుతం గరిష్ట పరిమితి రూ.12 ఉండగానే మన రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఏడు సార్లు వివిధ రూపాల్లో చార్జీలు పెంచి రూ.16 వేల కోట్లకుపైన ప్రజల నెత్తిన అదనంగా మోదింది. ఇదే సమయంలో డిస్కంలు రూ.50 వేల కోట్ల అప్పులు మూటగట్టుకున్నాయి. డిస్కంల సంక్షోభానికి ప్రైవేటు విద్యుత్ కొనుగోలు భారం ఒక కారణమైతే, ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు, ఇతర బకాయిల వంటివి సకాలంలో అందక పోవడం ఇంకో కారణం. ఇప్పుడే ఇలా ఉంటే, ప్రైవేటు నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధర రూ.50 అయితే పరిస్థితి ఇంకెంతగా కుదేలవుతుందో ఊహించడానికి భయమేస్తోంది. ఎప్పుడో కొని పంపిణీ చేసిన విద్యుత్‌కు కొన్నేళ్ల తర్వాత ట్రూఅప్ చార్జీలను ప్రజల నుంచి గోళ్లూడగొట్టి గుంజుతున్నారు. ఇక నుంచి ప్రతి నెలా ఛార్జీలు పెంచుతామంటున్నారు. ఇవి చాలదన్నట్లు రూ.60 వేలున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1.30 లక్షలకు కొనుగోలు చేస్తున్నారు. అందు నిమిత్తం ఒకే కంపెనీకి రూ.2,600 కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు. ఇటువంటి అవినీతి, అక్రమాల మూల్యం చివరికి వినియోగదారులే చెల్లించుకోవాలి.

దేశంలో 1990వ దశకంలో సరళీకరణ విధానాలు మొదలయ్యాక ప్రపంచబ్యాంక్ ఆదేశాలతో విద్యుత్ సంస్కరణలు అంకురించాయి. నయా–ఉదారవాదం ఊపందుకున్నాక కీలకమైన విద్యుత్ రంగంలో దేశ, విదేశీ కార్పొరేట్ల ఆధిపత్యం పెరిగింది. మన రాష్ట్రం ప్రయోగశాలగా మారింది. విద్యుత్ నియంత్రణ కమిషన్లు ఉన్నా వాటి తీర్పులు, ఆదేశాలు అంతిమంగా కార్పొరేట్లకే అనుకూలిస్తున్నాయి. ప్రభుత్వరంగంలో విద్యుదుత్పత్తి సంస్థలను పడుకోబెట్టి వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి సహాయ నిరాకరణను పాటిస్తున్నాయి ప్రభుత్వాలు. సబ్సిడీల ఎగవేతకు పాల్పడుతున్నాయి. ఇదే సమయంలో పవర్ పర్చేజి అగ్రిమెంట్ల (పిపిఎ)తో ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి అధిక ధరలకు కరెంట్‌ను కొనుగోలు చేసి వాటి దోపిడీకి దన్నుగా నిలుస్తున్నాయి. అందువల్ల ఒనగూడే నష్టాలను వినియోగదారులకు చార్జీల పెంపుదలతో బదిలీ చేస్తున్నాయి. మోడీ ప్రభుత్వం వినాశకర విద్యుత్ సంస్కరణల బిల్లుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. కేంద్ర ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్‌కు మీటర్లు బిగించి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే దిశగా పయనిస్తోంది. ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటిస్తూ నాడు జరిగిన బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తి దేశమంతటా రగలాల్సిన ఆవశ్యకత ఉంది. అప్పుడే ప్రభుత్వాలు దిగొస్తాయి.


మహనీయుల మాట



సామాజిక రుగ్మతలన్నిటికీ మూల కారణం...అనేక మందిపై ఆధిపత్యం వహించాలనే కోర్కె.. ఇతరుల శ్రమను దోచుకుని సుఖాలు అనుభవించాలనే కోర్కె.. ఒక తెగకు లేక ఒక గణానికి నాయకునిగా వున్న వ్యక్తి ఆ సామూహిక బలం వల్ల తనకు వచ్చిన శక్తిని...తన వ్యక్తిగత బలంగా భ్రమించి తనను తాను అతిగా ఊహించుకునే తత్వం.

- మగ్జిమ్ గోర్కీ

ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత.



క్రోనీ విధానాలు, 'జాతీయ ప్రయోజనాలు' అనే భ్రాంతి

విశ్లేషణ

సంజయ్ రాయ్

అదానీ గ్రూపు కంపెనీలపై హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక చూపించిన ప్రభావంతోను, దానికి భారత ప్రభుత్వం రాజకీయంగా స్పందించిన తీరుతోను భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం చవి చూస్తున్న కొన్ని ఆందోళనకరమైన ధోరణులు బైటపడ్డాయి. భారత ప్రభుత్వం బడా పెట్టుబడికి రక్షణగా స్పందించిన విధానం అంత ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. నిజానికి గత రెండు దశాబ్దాలకు పైగా ఈ ప్రభుత్వం చేస్తున్నది అదే. ఇక ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేది కూడా అంత కొత్తదేమీ కాదని మనదేశంలో ప్రభుత్వానికి, పెట్టుబడిదారులకు మధ్య ఉండే సంబంధాల చరిత్రను పరిశీలించేవారికి తెలుస్తుంది. ఈ దేశంలో గుత్త పెట్టుబడిదారులు అమలులో ఉండే నియమ నిబంధనలను ప్రమాదకరమైన రీతిలో ఉల్లంఘించినప్పుడు వారిని అదుపు చేయవలసివచ్చిన సందర్భాలలో ఏదో ఒక విధంగా వారికి ప్రయోజనాలు చేకూరేలా వ్యవహరిస్తూ, పాలకులు జాతీయ ప్రయోజనాలకు ద్రోహం చేస్తూనే వున్నారు.

తక్కినవారిని పక్కకు నెట్టి అత్యధిక ప్రయోజనాలను తమ స్వంతం చేసుకోడానికి అమలులో ఉండే నియమ నిబంధనలను మసి పూసి మారేడుకాయ చేయడం, అందుకోసం రాజకీయ అధినేతతో అత్యంత సన్నిహిత సంబంధాలను నెరపడం ఈ బడా పెట్టుబడిదారులకు మొదటినుంచీ అలవాటే. నయా ఉదారవాద విధానాల అమలు మొదలయ్యే మునుపు కొన్ని రంగాలలో కొద్ది బడా వ్యాపార సంస్థలమీదే అతి ఎక్కువగా ఆధారపడవలసిన సందర్భాలు తటస్థించినప్పుడు దానిని లోతుగా పరిశీలించిన దరిమిలా ఈ వ్యవస్థ రూపొందించిన నియమ నిబంధనలు గౌరవింపబడేటట్టు చేయవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా ఏర్పరచిన కట్టుబాట్లను సైతం అతిక్రమించడం, బడా గుత్త పెట్టుబడిదారులు మరింత ఎక్కువగా ఆర్థిక సంపదను పోగేసుకోవడం కొనసాగింది.

బడా కార్పొరేట్లకు, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు నడుమ ఉండే సన్నిహిత సంబంధాలతో పరిశ్రమాధిపతుల్ని క్రమశిక్షణలో ఉంచడం మాత్రం సాధ్యం కాలేదు. కొన్ని తూర్పు ఆసియా దేశాలలో అభివృద్ధి జరిగిన దశలో ఆవిధంగా చేయగలిగారు కాని మన దేశంలో మాత్రం అది కుదరలేదు. పెట్టుబడిదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించినందుకు లేదా వారు నిబంధనలను పాటించనప్పుడు కావాలనే పట్టించుకోకుండా ఉన్నందుకు ఆ యా రాజకీయ పార్టీలకు ఆర్థిక తోడ్పాటు అందుతూ వచ్చింది. ప్రభుత్వం ద్వారా బడా పెట్టుబడిదారులు పొందే రాయితీల, ఇతర ప్రయోజనాల రూపంలో పొందే ప్రజాధనం ఎంత ఉన్నా, దానిని ఉపయోగించుకుని దీర్ఘకాలంలో మార్కెట్‌లో పోటీని తట్టుకుని మన దేశం నిలబడగలిగేలా సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు అటు ప్రభుత్వం కాని, ఇటు బడా కార్పొరేట్లు కాని ఎటువంటి ప్రయత్నమూ చేయనేలేదు. ఐతే, ప్రభుత్వాలు కొంతమంది పెట్టుబడిదారులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించడానికి పూనుకున్న పలు సందర్భాలలో బహిరంగంగా వేడివేడి చర్చలు జరిగేవి. అటువంటి సందర్భాలలో లోతుగా పరిశీలన జరిగేది. కాని ఇప్పుడు అలా జరగడం లేదు. ఎన్నికల బాండ్లు వచ్చాక ఎటువంటి చర్చలూ మనకి కనిపించడం లేదు.

ఇప్పుడు అదానీ వ్యవహారం మీద దుమారం రేగుతున్నప్పుడు దేశంలోని అత్యున్నత పదవిని అధిష్టించిన వ్యక్తి ఆ చర్చను పూర్తిగా వేరే దిశలో పక్కదోవ పట్టించేవిధంగా జోక్యం చేసుకున్న తీరుకు ఈ దేశ ప్రజానీకం అందరూ ఆశ్చర్యపోతున్నారు. దేశ ప్రధాని తన అధికారాన్ని ఉపయోగించి ఒక వ్యాపార సంస్థకి అత్యధిక ప్రయోజనాలు కల్పిస్తూ తక్కినవారికి అవకాశం లేకుండా చేసిన విధానాన్ని, కొందరిని బలవంతంగా లొంగదీసుకున్న విధానాన్ని అనేకులు అనేక విధాలుగా ప్రశ్నిస్తున్నారు. ఆ విధంగా సాగుతున్న అవినీతి పద్ధతులను, తప్పుడు మార్గాల ద్వారా అదానీ కంపెనీల షేర్లను ఎక్కువ విలువ ఉన్నట్టు చూపించడాన్ని ప్రశ్నించడం అంటే అది భారతదేశం సాధించిన విజయాలను ప్రశ్నించడమే అని, ప్రపంచవ్యాప్త మదుపుదారుల ముందు భారతదేశాన్ని తక్కువ చేసి చూపడమే అని ప్రధాని వ్యాఖ్యానించారు.



స్టాక్ మార్కెట్ జూదానికి ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ఒడ్డడం వలన కలిగే పర్యవసానాలు చాలా అవాంఛనీయ మైనవిగా ఉంటాయి. అదానీ షేర్లు పడిపోవడం కొనసాగితే మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లుతుంది. దాని వలన అదానీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా మార్కెట్ నుండి పెట్టుబడులు సేకరించడం దుస్సాధ్యం అవుతుంది. దాని వలన పెట్టుబడులు పెట్టే క్రమం దెబ్బతింటుంది. ప్రస్తుతం నడుస్తున్న, త్వరలో మొదలు కానున్న మౌలిక వసతుల రంగ ప్రాజెక్టులు పూర్తి కావడం కష్టం అవుతుంది. కాబట్టి అదానీ ప్రయోజనాలు గనుక దెబ్బ తింటే దేశానికే నష్టం అనే చిత్త భ్రమ ఇక్కడి నుండే మొదలౌతుంది. కాని ఈ పరిస్థితి ఏ విధంగా ఉత్పన్నం అయ్యింది? కేవలం ఒక్కరి చేతుల్లో సంపద కేంద్రీకరించబడడం, అందుకు ప్రధాని కార్యాలయం నేరుగా తోడ్పాటు, ఆశ్రయం కల్పించడం మాత్రమే ఈ పరిస్థితికి కారణాలు.

పార్లమెంటులో ఏ ప్రశ్న లేవనెత్తినా, తమకు మెజారిటీ ఉంది అన్న వాదనతో ఆ ప్రశ్నలను పట్టించుకోకపోవడమో, పక్కకు నెట్టివేయడమో, లేక బలవంతంగా తమ మాట నెగ్గించుకోవడమో పరిపాటి అయిపోయింది. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదం తెచ్చిపెట్టే ధోరణి. తమ పార్టీకి మెజారిటీ ఉంటే చాలు. ఇక ప్రజలకు ఏ విషయంలోనూ జవాబు చెప్పనవసరం లేదన్నమాట!

సరళీకరణ కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ యావత్తూ ఎటువంటి ఆర్థిక నిర్మాణ చట్రం పరిధిలో బిగించివేయ బడుతుందంటే అందులో ద్రవ్య పెట్టుబడి, కార్పొరేట్ల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా, ప్రజల ప్రయోజనాలుగా పరిగణించబడే పరిస్థితి ఏర్పడుతుంది. బడా కార్పొరేట్లు దేశ ఆర్థిక వ్యవస్థతో అంతకంతకూ మరింత ఎక్కువగా పెనవేసుకుపోతున్నారు. మరో పక్క ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు ఉపసంహరించబడుతున్నాయి. వాటి వాటాలు స్టాక్ మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నారు. ఆ స్టాక్ మార్కెట్ పదే పదే కుదేలవుతూ, షేర్ల విలువలు కరిగిపోతున్నాయి. మదుపుదారులలో అవి తీవ్ర ప్రకంపనలు కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగా లేదన్నదానికి సంకేతాలు. ఆర్థిక వ్యవస్థ లో అంతకంతకూ ద్రవ్య పెట్టుబడి పాత్ర పెరుగుతూ పోతోంది. ఆ స్టాక్‌మార్కెట్ జూదంలో కార్పొరేట్ల లాభాలు అంతకంతకూ పెరుగుతూంటే మరోపక్క అక్కడ సంభవించే నష్టాలు మాత్రం సామాన్య మదుపుదారుల నెత్తిమీద పడుతున్నాయి. ఈ విధంగా జరగడం దేశ ప్రయోజనాలకోసమే అన్న భ్రమ, కార్పొరేట్ల ప్రయోజనాలే దేశ ప్రజల ప్రయోజనాలు అన్న భ్రమ అంతకంతకూ మరింత బలపడుతోంది. ఇప్పుడు అదానీ పెట్టుబడులు దేశంలో ఎంత ఎక్కువగా ఉన్నాయంటే, స్వయానా ప్రధాని ఆదరణతో అవి ఎంత విస్తరించాయంటే, దాని పర్యవసానంగా ఇప్పుడు అదానీ కుప్పకూలడం అంటే భారతదేశమే కుప్పకూలడం అన్న ఆందోళన కలుగుతుందన్నమాట.

మౌలిక వసతుల కల్పన రంగంలో అదానీ గ్రూపు

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీకి చెందిన క్యాప్ ఎక్స్ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం అదానీ గ్రూపు ప్రస్తుతం చేపట్టినవి గాని, చేపట్టనున్నట్టు ప్రకటించినవి గాని మౌలిక వసతుల కల్పన రంగపు ప్రాజెక్టులు 191 దాకా ఉన్నాయి. వాటిలో సుమారు ఏడు లక్షల కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు ఉన్నాయి. ఇవి గాక ఇప్పటికి 123 పెద్ద ప్రాజెక్టులు పూర్తి అయ్యాయి. వాటి విలువ లక్ష కోట్ల రూపాయలకు పైబడే ఉంటుంది.

కొత్తగా పెట్టుబడులు పెడుతున్న ప్రాజెక్టులలో 13 పోర్టులు, 33 సౌర, పవన, జల విద్యుత్తు ప్రాజెక్టులు, 12 సాంప్రదాయ విద్యుత్తు ప్రాజెక్టులు, విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, సిమెంటు ప్రాజెక్టులు వంటివి ఉన్నాయి. భారీ ప్రాజెక్టుల పెట్టుబడులు రెండేళ్ళపాటు పెడతారు. ప్రస్తుతం కొనసాగుతున్న పెట్టుబడుల విలువ సుమారు 7.168 లక్షల కోట్లు. మన దేశంలో ఒక ఏడాదిలోపు పూర్తి అయ్యే మొత్తం ప్రాజెక్టుల విలువతో సమానమైన విలువ కల ప్రాజెక్టులు తాము చేపడుతున్నట్టు అదానీ గ్రూపు ప్రకటించింది. దానిని బట్టి భారతదేశంలో మౌలిక వసతుల కల్పన రంగంలో అదానీ గ్రూపు సంస్థలదే సింహభాగం అని స్పష్టం ఔతోంది.

ఇక అదానీ గ్రూపు సంస్థల ఆర్థిక పరిస్థితి చూద్దాం. అదానీ గ్రూపు సంస్థల మొత్తం ఆస్తులకు, ఆ కంపెనీలు చెల్లించవలసిన దానికి మధ్య నిష్పత్తి 2021–22లో 0.74 గా ఉంది. మన దేశంలోని తక్కిన బడా కార్పొరేట్ కంపెనీల ఆస్తులు–అప్పుల నిష్పత్తితో పోల్చితే అదానీ గ్రూపు సంస్థలదే అతి తక్కువగా ఉంది. ఇక అప్పులకు, వాటాల విలువకు మధ్య నిష్పత్తి చూస్తే 1.5 నుండి 1.1 మధ్య ఉంది. తక్కిన బడా కార్పొరేట్ సంస్థలతో పోల్చితే ఇదే అత్యధికంగా ఉంది. దీనిని బట్టి అదానీ గ్రూపు సంస్థలు తక్కిన కార్పొరేట్ సంస్థలకన్నా చాలా ఎక్కువ మోతాదులో రుణాల మీద ఆధారపడి నడుస్తున్నాయని కనపడుతోంది. చాలా ఎక్కువ పెట్టుబడులు మౌలిక వసతుల కల్పన రంగంలో పెడుతున్నా, అదానీ సంస్థల స్థిరాస్తులలో పెరుగుదల రేటు తక్కిన సంస్థల (ఆర్థికేతర సంస్థల) కన్నా చాలా తక్కువగా ఉంది. ఇది ఆసక్తి రేకెత్తించే మరో అంశం. గత మూడేళ్ల కాలంలో తక్కిన ఆర్థికేతర సంస్థల స్థిరాస్తుల విలువ పెరుగుదల రేటు (2019 నుంచి 2022 మధ్య) 5.3 శాతం ఉంటే, అదానీ సంస్థల స్థిరాస్తుల పెరుగుదల రేటు మైనస్1.7 గా ఉంది. ఈ వాస్తవ వివరాలన్నీ దేశంలోను, బైట ఉన్న మదుపుదారులకు ఆందోళన తప్పకుండా కలిగించే అంశాలే. హిండెన్‌బర్గ్ నివేదిక కూడా అదానీ గ్రూపు సంస్థలు తలకు మించిన అప్పులు చేశాయని, వాటి షేర్ల విలువను కృత్రిమంగా పెంచి చూపించాయని ప్రధానంగా ఆరోపించింది. అందుకే ఆ నివేదిక బహిర్గతం అయ్యాక ఆ షేర్ల విలువలు భారీగా పడిపోయాయి. దాని ఫలితంగా అదానీ గ్రూపు సంస్థలు తాము ప్రకటించిన రూ.20,000 కోట్ల విలువ కల ఫాలో అప్ ఆఫర్ ను వెనక్కి తీసుకోవలసివచ్చింది. అంతేకాక, తమ రెవెన్యూ వృద్ధి లక్ష్యాలను, పెట్టుబడి వ్యయం లక్ష్యాలను కూడా కుదించుకోవలసి వచ్చింది.

'జాతీయ ప్రయోజనాలు అనే చిత్త భ్రమ'

అదానీ కంపెనీల వాటాల్లో చిక్కుకున్న ఎస్‌బిఐ పెట్టుబడుల విలువ రూ. 27,000 కోట్లు వరకూ ఉంటుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు కూడా అదానీ షేర్లలో పెట్టుబడులు ఉన్నాయి. ఇక ఎల్.ఐ.సి పెట్టుబడులు రూ. 36,500 కోట్లు వరకూ ఉన్నాయి. ఐతే ఆర్థిక మంత్రితో సహా ఉన్నతాధికారులందరూ ఈ పెట్టుబడుల మోతాదు ఆ సంస్థలు తట్టుకోలేనంత ఎక్కువేమీ కాదని గట్టిగా చెప్పారు. ఒక వేళ అదానీ షేర్లు ఇంకా పడిపోయినా, ఎల్.ఐ.సి వద్ద బీమా క్లెయిములు చెల్లించడానికి కావలసినంత నిల్వలు ఉన్నాయని కూడా ప్రకటించారు. అదానీ గ్యాస్, అదానీ పోర్ట్స్ వంటి కంపెనీల్లో కూడా ఎల్.ఐ.సి పెట్టుబడులు ఉన్నాయి. మంత్రిగారు ఎంత నమ్మబలికినా, అదానీ షేర్ల విలువ ఇదే విధంగా పడిపోతూవుంటే ఈ ప్రభుత్వ రంగ సంస్థల షేర్ల విలువలు కూడా పడిపోక తప్పదు.

స్టాక్ మార్కెట్ జూదానికి ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ఒడ్డడం వలన కలిగే పర్యవసానాలు చాలా అవాంఛనీయమైనవిగా ఉంటాయి. అదానీ షేర్లు పడిపోవడం కొనసాగితే మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లుతుంది. దాని వలన అదానీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా మార్కెట్ నుండి పెట్టుబడులు సేకరించడం దుస్సాధ్యం అవుతుంది. దాని వలన పెట్టుబడులు పెట్టే క్రమం దెబ్బ తింటుంది. ప్రస్తుతం నడుస్తున్న, త్వరలో మొదలు కానున్న మౌలిక వసతుల రంగ ప్రాజెక్టులు పూర్తి కావడం కష్టం అవుతుంది. కాబట్టి అదానీ ప్రయోజనాలు గనుక దెబ్బ తింటే దేశానికే నష్టం అనే చిత్త భ్రమ ఇక్కడి నుండే మొదలౌతుంది. కాని ఈ పరిస్థితి ఏ విధంగా ఉత్పన్నం అయ్యింది? కేవలం ఒక్కరి చేతుల్లో సంపద కేంద్రీకరించబడడం, అందుకు ప్రధాని కార్యాలయం నేరుగా తోడ్పాటు, ఆశ్రయం కల్పించడం మాత్రమే ఈ పరిస్థితికి కారణాలు. అందువల్లనే పెట్టుబడుల కోసం ఒకే ఒక బడా కార్పొరేట్ సంస్థ మీద అతిగా ఆధారపడవలసిన పరిస్థితి దాపురించింది.

కేవలం అదానీ కంపెనీల షేర్లు కిందా మీదా అయినంతమాత్రాన దేశానికి, సామాన్య ప్రజానీకానికి అదేమీ పెద్ద సమస్యగా మారదు. నిజానికి ఇటువంటి స్టాక్‌మార్కెట్ జూదంలో ఎక్కువగా దెబ్బ తినేది చిన్న మదుపరులే. పెద్ద మదుపుదారులకి ఆ యా కంపెనీల లోపల జరుగుతున్న వ్యవహారాల గురించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుతూనే వుంటుంది. అంతే కాదు, ఇలా తరుచూ షేర్ల సూచిక పడిపోవడం, మళ్ళీ పెరగడం అనే ప్రక్రియ క్రమంగా కొద్దిమంది చేతుల్లో పెట్టుబడులు కేంద్రీకృతం కావడానికి దోహదం చేస్తుంది కూడా. అందుకనే ప్రస్తుతం అదానీ ఉదంతం తర్వాత కూడా ఏ విధంగా జోక్యం చేసుకుంటే స్టాక్ మార్కెట్ విశ్వసనీయత పెరుగుతుంది? అన్న కోణం నుంచే చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత నయా ఉదారవాద చట్రం పరిధిలోనే పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు.

ఇక్కడ ఆర్థిక వ్యవహారాలు అన్నీ సజావుగానే సాగుతున్నట్టు చిత్రీకరించడానికి, ఏదో విధంగా జాతీయ, అంతర్జాతీయ మదుపుదారులలో విశ్వాసాన్ని నెలకొల్పడానికి తంటాలు పడుతున్నారు. కాని ఈ విధమైన పరిస్థితి ఉత్పన్నం కావడానికి మూలకారణాలైన సంపద కేంద్రీకరణ, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలోని వ్యవస్థీకృత అంతర్భాగాలే. అందుచేత ఇప్పుడు మొత్తం ఆర్థిక వ్యవస్థనే పూర్తిగా చక్కదిద్దడం, అందులో భాగంగా స్పెక్యులేటివ్ లావాదేవీలను పూర్తిగా నియంత్రించడం జరిగితేనే సరైన పరిష్కారం దొరుకుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

ప్రజల కోసం సైన్స్

సందర్భం

ప్రజల కోసం సైన్స్, దేశ స్వావలంబన కోసం సైన్స్, ప్రపంచ శాంతి కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, పర్యావరణం కోసం సైన్స్...అనే లక్ష్యాల సాధన కోసం జన విజ్ఞాన వేదిక 35 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కృషి చేస్తోంది. శాస్త్రీయ సమాజ నిర్మాణం పరమావధిగా పాటుపడుతూ నిరంతరం వైవిధ్య భరిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి అవరోధంగా నున్న నిరక్షరాస్యతను నిర్మూలించాల్సిన అవసరాన్ని గుర్తించి, బాధ్యతతో లక్షలాది స్వచ్ఛంద కార్యకర్తలను తయారుచేసింది. వారికి శిక్షణ ఇచ్చి కళాజాతాల ద్వారా ప్రజలలో చదువుకోవాలనే కోరికను రగిలించింది. కోట్లమంది నిరక్షరాస్యులను అక్షర కేంద్రాలకు నడిపించింది. ఎర్నాకులం నుండి ఆంధ్రావని దాకా సాగిన సాక్షరతా ఉద్యమంలో మమేకమై సాగింది.

సాక్షరతా చైతన్యంతో అక్షర కేంద్రాలలో మహిళలు మద్యపాన నష్టాలను గుర్తించారు. మా ఊరికి సారా వద్దని దూబగుంట రోశమ్మ చేసిన పోరాటం రాష్ట్రమంతా వ్యాపించింది. జన విజ్ఞాన వేదిక వారికి అండగా నిలిచింది. అనేక నిర్బంధా లను తట్టుకొని నిలబడింది. ఈ ఉద్యమం రాజకీయ అంశంగా మారి ప్రభుత్వాలు మారే పరిస్థితి ఏర్పడింది. సారా వ్యతిరేక ఉద్యమంలో సంఘటితమైన మహిళలు ఆర్థిక పరిపుష్టి కొరకు పొదుపు సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇది వేలాదిగా పొదుపు సంఘాల ఏర్పాటుకు, మహిళా సాధికారతకు ఉపయోగపడింది. ఆ తరువాత రాజకీయ పరిస్థితులు మారి మద్యపాన నిషేధం ఎత్తివేయబడింది. అయినా తూర్పు గోదావరి జిల్లాలో జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ విభాగం చేస్తున్న అవగాహనా, ప్రచార కార్యక్రమాలు నేడు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్నాయి.



కెవివి సత్యనారాయణ

నేడు కొంతమంది సూడోసైన్స్‌ను విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. పురాణ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ వుందంటూ ప్రజలను నమ్మించాలని చూస్తున్నారు. ఇటువంటి రుజువు లేని అశాస్త్రీయ అంశాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ నిజమైన సైన్స్ ప్రజల ప్రగతికి ఎలా దోహదం చేసిందో జెవివి ప్రచారం చేస్తోంది.



నేడు జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం

"దేశమంటే మట్టి కాదోయ్...దేశమంటే మనుషులోయ్" అనే గురజాడ మహాకవి స్ఫూర్తితో ఈ దేశం మనది ఈ దేశాన్ని కాపాడుకుందాం అని, సైన్స్ ప్రజల కోసమే అని చాటిచెప్పింది జన విజ్ఞాన వేదిక. రాష్ట్రం లోని వేలాది గ్రామాలలో 'జన జాగరణ' పేరుతో ఆరోగ్యం, విద్య, వ్యవసాయం వంటి మౌలిక విషయాలపై 'హమారా దేశ్' కార్యక్రమంలో రోజుల తరబడి ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించింది. దేశాన్ని తెలుసుకుందాం – దేశాన్ని మార్చుకుందాం (దేశ్ కో జానో – దేశ్ కో బదలో) అంటూ మేధావులను దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేసింది.

రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు కీలకమైన సహజ వాయువు విషయంలో రిలయన్స్ సంస్థ చేసిన అన్యాయాన్ని ఆనాడే ఎండగట్టడానికి 2007లో జీపు జాతాలను నిర్వహించింది. గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చి కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదించబడేటట్లు చేసింది జన విజ్ఞాన వేదిక.

ఆస్తమా వ్యాధిగ్రస్తులతో చెలగాటమాడుతూ హైదరాబాదులో బత్తిన సోదరులు వేసే చేపమందు శాస్త్రీయతను జన విజ్ఞాన వేదిక ప్రశ్నించింది. ప్రయోగశాలలో పరిశీలింపచేసి చేప మందుకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేసింది. ప్రజా చైతన్య, అవగాహనా కార్యక్రమాలు చేపట్టింది. అన్ని ప్రయోగశాలల్లో చేపమందులో ఆస్తమా నివారణ గుణాలు లేవని తేల్చి చెప్పడంతో వారు చట్టం నుండి తప్పించుకోడానికి "మందు కాదు..ప్రసాదం" అని చెప్పడం జరిగింది. చేపమందు కోసం లక్షలలో వచ్చే జనం సంఖ్య వేలకు పడిపోయింది. చేపమందుపై కరపత్రాన్ని అందరికీ పంచింది. డాక్టర్లను కలిసి అభిప్రాయ సేకరణ నిర్వహించింది. ప్రతి సంవత్సరం పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నది.

ప్రజారోగ్యాన్ని వ్యాపారం చేస్తూ లక్షలాది కోట్ల రూపాయలను దోస్తున్న మందుల కంపెనీల మాయా జాలాన్ని "మందులా! మారణాయుధాలా!!" అని ప్రశ్నించింది జన విజ్ఞాన వేదిక. మార్కెట్లో ఉన్న ఎన్ని మందులు అవసరమో వివరించి చెప్పింది. ప్రజల ఆరోగ్యం ప్రజల చేతుల్లో వుండాలని "ఆరోగ్య దీపం" కార్యక్రమాలు నిర్వహించింది. "ప్రభుత్వ ఆసుపత్రిని కాపాడుకుందాం – ప్రజారోగ్యాన్ని పరిరక్షించుదాం" అనే నినాదంతో రాష్ట్రంలోని అనేక సంస్థలతో కలిసి ప్రజారోగ్య ఉద్యమం జన స్వాస్థ్య అభియాన్ కృషి కొనసాగిస్తున్నది. జె.వి.వి ఆవిర్భావం నాటి నాయకులు, భద్రాచలం పూర్వ ఎంపి డా.మిడియం బాబూరావు ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల్లో గ్రామ సర్వేలు నిర్వహించింది. అందరికీ ఆరోగ్యంపై సంతకాల సేకరణ కార్యక్రమం చేసింది. గిరిజన బాల మేళాల ద్వారా సైన్స్ పట్ల అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య జాగ్రత్తలు చెప్తూ వారిలో వున్న మూఢనమ్మకాలను పోగొట్టింది.

"కూల్ డ్రింక్స్ కావు అవి కిల్లర్ డ్రింక్స్" అని శీతల పానీయాలలో మేలు కన్న కీడు ఎక్కువ వున్నది అని ప్రచారం చేసింది జన విజ్ఞాన వేదిక. కూల్ డ్రింక్స్‌లో ఆరోగ్యానికి హానిచేసే పదార్థాలు ఉన్నాయని నిరూపించి వాటిలోని కుళ్ళును బయట పెట్టింది. కూల్ డ్రింక్స్ పేరుతో బహుళజాతి సంస్థలు వేల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాయని వివరించింది. మజ్జిగ, నిమ్మ నీళ్ళు, పండ్ల రసాల వాడకం వలన శీతల పానీయాల వల్ల జరిగే హాని జరగదని, మన రైతులకు బాసటగా నిలిచి వ్యసాయ రంగానికి మేలు చేయవచ్చని తెలియజెప్పింది. ఆ కృషి ఫలితంగా అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ ఆసుపత్రులలో కూల్ డ్రింక్స్ అమ్మకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెం. 921 ద్వారా నిషేధించింది.

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చేయాలని మహారాష్ట్రలో ఉద్యమించిన డా॥ధభోల్కర్‌ని మతోన్మాద మూకలు హత్య చేసిన ఆగస్ట్ 20వ తేదీని జాతీయ దృక్పథ దినోత్సవంగా జరుపుతోంది. అంతేగాక అన్ని ప్రాంతాలలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ(హెచ్)కు అనుగుణంగా జాతి మొత్తం శాస్త్రీయ ఆలోచన కలిగివుండాలని కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

1988 ఫిబ్రవరి 28న జన విజ్ఞాన వేదిక ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భవించింది. ప్రతి సంవత్సరం ఈ రోజు జాతీయ సైన్సు దినోత్సవం, జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం జరుపుతూ ప్రజల చెంతకు సైన్స్ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఉన్న చట్టాలను నిర్వీర్యం చేస్తూ, ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేస్తున్న నేటి పరిస్థితుల్లో జన విజ్ఞాన వేదిక బాధ్యత, పని మరింత పెరిగింది. ప్రజలను సమస్యల నుంచి మళ్లించడానికి, ప్రజల్లో హిందూ మతోన్మాద విధానాలను పెంచి పోషిస్తూ అనైక్యతను, అభద్రతా భావాన్ని పెంచి పోషిస్తున్న ఈ తరుణంలో జన విజ్ఞాన వేదిక విస్తరణ, ప్రచారం మరింత పెంచాల్సిన అవసరం ఏర్పడింది. జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ వైపు కృషి పెంచుదాం. చేయి చేయి కలిపి మన లక్ష్యాల సాధనకు పాటుపడదాం.

/ వ్యాసకర్త:జన విజ్ఞాన వేదిక (ఎ.పి) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, సెల్:8500004953 /

జనవాక్యం

బలవన్మరణాలు బాధాకరం

వరంగల్ వైద్య కళాశాలలో పీజీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్య అత్యంత విషాదకరం. ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తరచుగా బలవన్మరణాలకు పాల్పడడం అసాధారణం. ఆత్మహత్యకు పురిగొల్పిన్న పరిస్థితుల్ని, అధిగమించ లేని బలహీన స్థితిని, వాటికి ఊతమిస్తున్న వాతావరణాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. గతవారమే ఐఐటీ ముంబై విద్యార్థి దర్శన్ క్యాంపస్ లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు ముంబై వైద్య కళాశాలలో మరో పీజీ విద్యార్థి పాయల్‌దీ ఇదే కథ. దశాబ్ద కాలంలో ఉన్నత విద్యాలయాల్లో 122 మంది ఇలా బలవన్మరణాలకు పాల్పడగా అందులో సగానికి పైగా బలహీన వర్గాల నుండి వచ్చిన వారే. పైన ఉదహరించిన ముగ్గురూ దళిత, ఆదివాసీ కుటుంబాల నుండి వచ్చిన వారే. పేదరికం నేపథ్యంగా ఎదిగిన వారే. ఆత్మహత్యలకు వేరువేరు కారణాలు ఉండొచ్చుగానీ వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన మార్గాలు స్పష్టమే. మొదట విద్యాలయాల్లో అంతర్గతంగా, బహిర్గతంగా వివక్ష కు గురిచేసే పరిస్థితులకు అడ్డుకట్ట పడాలి. ర్యాగింగ్ పై ఉక్కుపాదం మోపాలి. మార్కుల విధానం, ఇతర అసెస్‌మెంట్ విధానాలు పారదర్శకంగా ఉండాలి. పక్షపాతం లేని విధంగా పాలనా విధానాలు యూనివర్సిటీల్లో అమలు కావాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులకు, మానసికంగా మద్దతు అవసరం పడ్డవారికి కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి.

- డా.డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

లోటు రూ.56,892 కోట్లు

- ఆదాయం రూ.1.24 లక్షల కోట్లు
- వ్యయం రూ.1.81 లక్షల కోట్లు
- జనవరి వరకు తేలిన లెక్కలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆదాయం కన్నా వ్యయం భారీగా నమోదవుతోంది. జనవరి వరకు తేలిన గణాంకాలను పరిశీలిస్తే ఇదే స్పష్టమవుతోంది. ఈ మిగులును రుణాల ద్వారా భర్తీ చేసినట్లు తేలింది. ఆ రుణ మొత్తాన్నే చివరకు ఆదాయ లోటుగా రాష్ట్ర ఆర్థికశాఖ చూపించింది. జనవరి వరకు తీసుకున్న రుణాన్ని చూస్తే బడ్జెట్‌లో ప్రతిపాదించిన మొత్తాన్ని దాటిపోయినట్లు తేలింది. పన్నుల రూపేణా రూ.92 వేల కోట్లు వసూలుకాగా, పన్నేతర వ్యయంగా రూ.3,797 కోట్లు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు రూ.28,442 కోట్లు కలిపి మొత్తం రూ.1,24,110 కోట్లు వచ్చింది. అయితే వ్యయం మాత్రం రూ.1,81,030 కోట్లు అయింది. దాదాపు రూ.56,892 కోట్లు ద్రవ్య లోటుగా తేలింది. ఈ మొత్తాన్ని రుణంగా తీసుకున్నారు. మొత్తం వ్యయంలో రెవెన్యూ వ్యయమే రూ.1,72,069 కోట్లుగా నమోదైంది. పెట్టుబడి వ్యయం కేవలం రూ.7,367 కోట్లుగా రికార్డయ్యింది. ఆదాయ లోటు రూ.47,959 కోట్లుగా నమోదు కావడం గమనార్హం.

బడ్జెట్‌లో మొత్తం రుణాలను రూ.47,537 కోట్లుగా ప్రతిపాదించగా, జనవరి వరకే ఈ మొత్తం రూ.57 వేల కోట్లకు దగ్గరగా చేరుకోవడం గమనార్హం. దీనిపైనే రిజర్వ్‌బ్యాంకు నుంచి హెచ్చరికలు రావడంతో ఫిబ్రవరిలో తక్కువ రుణాలు తీసుకోవడం తెలిసిందే. ఇక మార్చి నెలలో మరిన్ని అదనపు రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి దరఖాస్తు చేసుకుంది. ఇవి మంజూరైతే మొత్తం రుణాలు రూ.65 వేల కోట్ల నుంచి రూ.70 వేల కోట్లకు చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి - బొమ్మనహాల్

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలోని కలగాలనిల్లి గ్రామానికి చెందిన హరిజన హేమావతి (40) సోమవారం వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, భర్త తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు.. హేమావతి ఉదయం పత్తి కలుపు తీయడానికి పొలానికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పొలంలో అకస్మాత్తుగా కింద పడిపోయింది. దీంతో బంధువులు హుటాహుటిన ఉద్దేహాల్‌లో ఆర్‌ఎంపి వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108 ద్వారా బళ్లారికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హేమావతి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

సిటిఒ కార్యాలయంలో ఎసిబి దాడులు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంపై సోమవారం సాయంత్రం ఎసిబి అధికారులు దాడి చేశారు. ఓ ఎగ్జిబిషన్ నిర్వాహకుని నుంచి లంచం తీసుకుంటూ ఉండగా అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములతో పాటు సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, అటెండర్ జ్యోతిరావు, క్లర్క్ శేఖర్‌లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి శివ నారాయణ స్వామి మాట్లాడుతూ.. పరిగి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వి.నాగేష్ బిందు ట్రేడ్ ఎగ్జిబిషన్ నడుపుతున్నాడు. హిందూపురం పట్టణంలోని నానేప్పనగర్‌లో గోడౌన్ ఏర్పాటు చేసుకుని అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పలు పట్టణాల్లో ఎగ్జిబిషన్ నడుతున్నాడు. ఇతను జిఎస్‌టి నెంబరు సైతం తీసుకుని టర్నోవర్ జరిగిన రూ.2లక్షలకు రూ.36వేలు పన్ను సైతం ఇటీవల చెల్లించాడు. కాగ రాజశేఖర్ టర్నోవర్ ఎక్కువ జరిగిందని దాడులు నిర్వహించి, జరిమానాలు విధిస్తే ఎక్కువ మొత్తంలో విధించాల్సి ఉంటుందని సిటిఒ అధికారులు అతన్ని బెదిరించారు. ఇలా జరక్కుండా ఉండాలంటే రూ.50వేలు లంచాన్ని డిమాండ్ చేశారు. ఇంత తాను ఇవ్వలేనని రూ.30 వేలు ఇవ్వడానికి బేరం కుదుర్చుకున్నాడు. ఇదే విషయాన్ని బాధితుడు నగేష్ ఎసిబి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎసిబి అధికారుల సూచన మేరకు నాగేష్ సోమవారం సాయంత్రం రూ.30 వల నగదును తీసుకుని సిటిఒ కార్యాలయానికి వెళ్లాడు. నగదును సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌కు ఇచ్చాడు. వెంటనే రాజశేఖర్ దీనిని క్లర్క్ శేఖర్‌కు రూ.25వేలు, అటెండర్ జ్యోతిరావుకు రూ.5 వేలు ఇచ్చాడు. అప్పటికే అక్కడ కాపుకాచిన ఎసిబి అధికారులు దాడులు చేసి లంచం తీసుకున్న ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ఈ అవినీతి బాగోతంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీరాములు ఉన్నాడని తేలడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి, వారిని రిమాండ్‌కు తరలించామని ఎసిబి డీఎస్పీ తెలిపారు.

మామిడి చెట్లు, మల్బరీ తోట దగ్ధం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి : సత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడా పురం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో తుంపిరి పెద్దన్నకు చెందిన మామిడి చెట్లు, మల్బరీ తోట పూర్తిగా కాలిపోయాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. మేడాపురం గ్రామానికి చెందిన తుంపిరి పెద్దన్న, సుజాతకు చెందిన మామిడి తోటకు సమీపంలో ఉన్న బీడు ప్రాంతంలోని ఎండుగడ్డికి ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మామిడి తోటతో పాటు సమీపంలో ఉన్న మల్బరీ తోట పూర్తిగా కాలిపోయింది. పంటలతో పాటు బోరు పైపులు, డ్రిప్పు పైపులు, పరికరాలు దగ్ధమైనట్లు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

మెడికో ప్రీతికి కన్నీటి వీడ్కోలు

ముగిసిన అంత్యక్రియలు

ఆత్మహత్యకాదు హత్యే
ప్రీతి తండ్రి నరేందర్‌నాయక్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో, అమరావతి బ్యూరో

సీనియర్ల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న కాకతీయ మెడికల్ కళాశాల పిజి విద్యార్థిని డా. ప్రీతి అంత్యక్రియలు సోమవారం జనగామ జిల్లాలోని స్వగ్రామం గిర్ని తండాలో ముగిశాయి. ఇంటి నుంచి సొంత వ్యవసాయ క్షేత్రం వరకు ప్రీతి అంతిమయాత్ర నిర్వహించిన కుటుంబ సభ్యులు అక్కడే ఖననం చేశారు. ప్రీతికి న్యాయం చేయాలి.. నిందితులను ఉరి తీయాలని అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు నినాదాలు చేశారు.

ప్రీతి మృతదేహాన్ని నిమ్స్ ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించి ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడ నుంచి బందోబస్తు నడుమ అంబులెన్సులో స్వగ్రామానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గిర్నీ తండాలో పెద్దఎత్తున పోలీసులు మొహరించారు. ప్రీతికి నివాళు లర్పించేందుకు బంధువులు, స్నేహితులు, ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రీతి మృతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపి సైఫ్‌తోపాటు ఉన్న మిగతా వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ప్రీతి అంత్యక్రియలో పాల్గొని ఆమె తల్లిదండ్రులను పరామర్శించి ప్రీతికి నివాళు లర్పించారు.

ఆత్మహత్య కాదు.. హత్యే..
ప్రీతి తండ్రి నరేందర్ నాయక్

తన కుమార్తె ప్రీతిది ఆత్మహత్య కాదు.. హత్యేనని, ఆమె తండ్రి నరేందర్ నాయక్ ఆరోపించారు. ప్రీతికి ఎవరో ఇంజక్షన్ ఇచ్చారన్నారు. అదే కోణంలో పోలీసులు విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రీతి మృతిచెందడానికి గల కారణాలు తెలపాలని డిమాండ్ చేశారు. కాకతీయ మెడికల్ కళాశాల అనస్థీషియా విభాగం హెచ్ఒడిని సస్పెండ్ చేసిన తర్వాతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాల న్నారు. అలా చేస్తేనే ప్రీతి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు, నిజా నిజాలు బయటకు వస్తాయని చెప్పారు.

పీతి మృతి బాధాకరం : పవన్ కల్యాణ్

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో పిజి చదువుతున్న డాక్టర్ ప్రీతి మరణం అత్యంత బాధాకరమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సీనియర్ వైద్య విద్యార్థి సైఫ్ వేధింపులు భరించలేక ప్రీతి బలవన్మరణానికి పాల్పడ్డ పరిస్థితులు, కన్నవారి మానసిక వేదన గురించి తలచుకుంటేనే హృదయం ద్రవించిందన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రీతి ఆత్మహత్యకు కారకుడైన వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కళాశాలలు ముఖ్యంగా మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల్లో ర్యాగింగ్, వేధింపులు అరికట్టడంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఈశాన్య జనవాణి... వినేదెవరని?

న్యూఢిల్లీ: నిరంతర నిర్లక్ష్యానికి ప్రతీకలు, నిర్విరామ వైఫల్యాలకు నిలువుటద్దాలు ఈ దేశ ఈశాన్య రాష్ట్రాలు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును ఏ మాత్రం ప్రభావితం చేయలేని అరకొర లోక్‌సభ స్థానాలే ఈ ప్రాంతం పట్ల జాతీయ పార్టీల చిన్నచూపునకు కారణమని పరిశీలకులు పేర్కొంటారు. నిరుద్యోగిత, అక్రమ మైనింగ్, హద్దులు దాటే అవినీతి.... ప్రజల బాగోగులు ఏ మాత్రం పట్టని పాలకులు, ఇక్కడ ప్రాంతీయ-ఉప ప్రాంతీయ పార్టీలదే హవా! పెద్ద పార్టీలతోనో, తమతో తామేనో చిన్నా చితకా పార్టీలు జట్టుకడతాయి. అధికారం, డబ్బు, కేంద్రంలో అధికారం కలిగివుండడం వంటివి ఎన్నికల్లో ఇటీవల కీలకపాత్ర వహిస్తున్నాయి.

పలుచబడ్డ విభజన రేఖా!త్రిపుర

జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (సిపిఎం)లు తలపడుతున్నాయి. ఒక్కపెట్టున తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వచ్చి ఇక్కడ హడావుడి చేస్తున్నా, సీట్ల పరంగా అది ప్రభావం చూపే అవకాశం లేదు. బిజెపిని ఈసారి ఓడించాలనే పట్టుదలతో సిపిఐ(ఎం) పోరాడింది.

త్రిపుర

పీపుల్స్‌పల్స్ అంచనా: బిజెపి: 18 -26, సిపిఎం : 14-22, టిఎంపి : 11-16, కాంగ్రెస్ : 1-3, ఐపిఎఫ్‌టి : 0-1, ఇతరులు 1-2.

మేఘాలయ

పీపుల్స్‌పల్స్ అంచనా : నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ) : 17-26, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ): 10-14, యుడిపి : 8-12, బిజెపి : 3-8, కాంగ్రెస్ : 3-5, ఇతరులు 4-9.

నాగాలాండ్

పీపుల్స్‌పల్స్ అంచనా : ఎన్డీపీపీ : 20-27, బీజేపీ : 14-21, ఎల్‌జేపీ :5-10, ఎన్పీఎఫ్:3-8, కాంగ్రెస్:2-4, ఇతరులు:2-4.

త్రిపురలో అనిశ్చితి

మేఘాలయలో హంగ్, నాగాలాండ్‌లో ఎన్‌డిపిపి-బిజెపి

ఎగ్జిట్ పోల్స్ అంచనా, మార్చి2న ఓట్ల లెక్కింపు

అగర్తల: వివిధ చానెళ్లు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో త్రిపురలో అనిశ్చిత నెలకొంటుందని, మేఘాలయలో హంగ్ ఏర్పడే అవకాశముందని అంచనా వేశాయి. నాగాలాండ్‌లో ఎన్‌డిపిపి- బిజెపి కూటమికి విజయం సాధిస్తుందని కొన్ని సర్వేలు తెలిపాయి. త్రిపురలో తిప్రా మోతా పార్టీ కింగ్ మేకర్ పాత్ర పోషించనుందని ఈ సర్వేలు పేర్కొన్నాయి. ఈ మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు గురువారం వెల్లడికానున్నాయి.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు

మేఘాలయ	ఎన్‌పిపి	టిఎంసి	బిజెపి
ఇండియా టుడే	18-24	5-9	4-8
జన్ కీ బాత్	11-16	9-14	3-7
టైమ్స్ నౌ	18-26	8-13	6-11
జీ న్యూస్	21-26	8-13	6-11

నాగాలాండ్	బిజెపి	ఎన్‌పిఎఫ్	కాంగ్రెస్
ఇండియా టుడే	38-48	3-8	1-2
జన్ కీ బాత్	35-45	6-10	0
టైమ్స్ నౌ	39-49	6-11	0
జీ న్యూస్	35-43	2-5	1-3

త్రిపుర	బిజెపి	లెఫ్ట్	తిప్రా
ఇండియా టుడే	36-45	6-11	9-16
జన్ కీ బాత్	29-40	9-16	10-14
టైమ్స్ నౌ	21-27	18-24	12-17
జీ న్యూస్	29-36	13-21	11-16

ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఎపి గ్రామ, వార్డు సచివాలయ సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్ఎం, వార్డు హెల్త్ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. వైద్యారోగ్యశాఖ కమిషనరు జె నివాస్‌ను ఆ సంఘం నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. జిఎఎన్ఎం శిక్షణ పూర్తిచేసుకున్న ఎఎన్ఎం, హెల్త్ కార్యదర్శులకు స్టాఫ్ నర్స్ పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్-2గా పరిగణించాలని, ఏ సచివాలయం నుంచైనా బయోమెట్రిక్ అవకాశం కల్పించాలని తెలిపారు. అజమాయిషి ఒకశాఖ అధికారులే ఉండేలా చూడాలని కోరారు. అదనపు యాప్‌ల భారం తగ్గించాలని, యూనిఫాం, వ్యాక్సిన్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ప్రమోషన్ ఛానల్‌పై స్పష్టత కల్పించాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని, ఇతర శాఖల విధులు కేటాయించకుండా చూడాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనరు వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు షేక్‌అబ్దుల్ రజాక్, నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ఒ అధిక పెన్షన్ కోసం దరఖాస్తు గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) పోర్టల్‌లో అధిక పెన్షన్ కోసం ఉద్యోగుల దరఖాస్తుల ముగింపు గడువును సోమవారం పొడిగించింది. అర్హులైన సభ్యులందరూ తమ యజమానులతో కలిసి మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. 2014, సెప్టెంబర్ 1కి ముందు సర్వీస్‌లో ఉండి, అనంతరం సర్వీసులో కొనసాగిన ఉద్యోగుల కోసం ఉమ్మడి ఎంపిక కోసం ముగింపు గడువును 2023 మే 3 వరకు పొడిగిస్తున్నట్లు ఇపిఎఫ్ఒ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. అర్హత గల సభ్యులందరికీ అధిక పెన్షన్‌ను ఎంచుకునేందుకు నాలుగు నెలల సమయం ఇవ్వాలని గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం .. నాలుగు నెలల గడువు మార్చి 3తో ముగియనుంది. ఈ పథకం కింద ఉద్యోగులు, యజమానులు సంయుక్తంగా దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా గతవారం ఇపిఎస్ ఒక పోర్టల్‌ను విడుదల చేసింది.

అంతరిక్ష, రక్షణ విభాగాల తయారీకి ఎపి అనుకూలం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంతరిక్ష, రక్షణ విభాగాల తయారీకి ఆంధ్రప్రదేశ్ అనుకూల ప్రదేశమని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో 3, 4 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా అంతరిక్ష, రక్షణ విభాగాల తయారీపై ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు రంగాలను బలోపేతం చేసేందుకు ఎపి కృషి చేస్తోందని పేర్కొంది. తయారీ రంగానికి అనుకూలమైన విధానాలను అమలు చేస్తామని వివరించింది. రాష్ట్రంలో ఇప్పటికే డిఆర్‌డిఒ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబొరేటరీ (ఎన్ఎఆర్ఎల్) వంటి సంస్థలను కలిగి ఉందని వెల్లడించింది. అంతరిక్ష, రక్షణ రంగాల్లో కూడా అనేక పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొంది. అనంతపురం జిల్లాలో ఆయుధాలు, రాడార్ల కోసం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) అనుసంధాన వ్యవస్థ యూనిట్‌ను, అదేవిధంగా కృష్ణా జిల్లాలో నూతన ఎలక్ట్రో ఆప్టిక్స్ అండ్ అడ్వాన్స్ నైట్ విజన్ కెమెరాల యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించింది. లాజిస్టిక్స్‌ను పెంచే లక్ష్యంతో విశాఖపట్నం సమీపంలో ఎయిర్‌కార్గో కాంప్లెక్స్ కూడా పైప్‌లైన్‌లో ఉందని పేర్కొంది. రానున్న రోజుల్లో రాజధాని కాబోతున్న విశాఖపట్నానికి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆహ్వానించారని వెల్లడించింది. దేశంలోనే ఎపి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, 11.43 శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొంది. ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉన్నామని తెలిపింది.

సిఎం పర్యటన పేరుతో ఆస్పత్రిలో సేవలు నిలిపివేత

- నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం తెనాలి సభ కోసం విద్యుత్ లైన్లు కట్ చేయడంతో తెనాలి ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు నిలిచిపోయాయని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రమాద బాధితులకు అత్యవసర వైద్యసేవలందించే అవకాశం లేకుండాపోయిందని, ఫలితంగా ముగ్గురు ప్రాణాలు పోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం సభ కోసం తరలిస్తున్న భారీ జనరేటర్ వాహనాన్ని గరువుపాలెం దగ్గర ఆటో ఢీకొని ముగ్గురు మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు పరిహారంతోపాటు మెరుగైన వైద్యసేవలందించాలని డిమాండ్ చేశారు.

అప్పర్ భద్ర వల్ల సీమకు నష్టం జరగదు

- సోము వీర్రాజు ఉవాచ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అప్పర్‌భద్ర ప్రాజెక్టు వలన రాయలసీమకు ఎటువంటి నష్టం జరగదని, రాష్ట్రానికి రావాల్సిన నీటివాటాను సీమకు తెప్పిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. సోమవారం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివేకానంద హత్య కేసులో సిబిఐ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తోందని, వివేకానందరెడ్డి కేసులో కేంద్రం ఎవరినీ కాపాడదని అన్నారు. ఎపిలో నియోజకవర్గానికి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉంటున్నారని, ఎమ్మెల్యేల కుటుంబీకులు అరాచకాలు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి కాకుండా అవినీతే ధ్యేయంగా పరిపాలన సాగుతోందని, వలంటరీ వ్యవస్థ కూడా దారుణంగా ఉందని దీనిపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

రాష్ట్రంలో జగన్ సంక్షేమం కాదు మోడీ సంక్షేమ జరుగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పూర్తి వివరాలతో ఏ వేదిక నుంచైనా చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. తనపై తమ పార్టీ నేతలు ఎవరూ అధిష్టానానికి ఫిర్యాదు చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు భానుప్రకాష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఎయిరిండియా భారీ ప్రణాళికలు

ముంబయి : టాటా గ్రూపునకు చెందిన ఎయిరిండియా భారీ ప్రణాళికలను రూపొందించుకుంది. రికార్డ్ స్థాయిలో 470 విమానాలను కొనుగోలు చేయనున్నట్లు ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ఈ ఒప్పంద విలువ రూ.70 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.5.7 లక్షల కోట్లు)గా ఉందని తెలిపారు. ఇందుకోసం సోమవారం ఆయన బోయింగ్, ఎయిర్‌బస్‌తో మెగా డీల్‌ను కుదుర్చుకున్నట్లు తెలిపారు. మరో 370 విమానాల కొనుగోలుపై కూడా దృష్టి పెడుతున్నామన్నారు. నెట్‌వర్క్, సామర్థ్య విస్తరణపై దృష్టి కేంద్రీకరించామన్నారు. విమానాల్లో 220 విమానాలను బోయింగ్ నుంచి, 250 విమానాలను ఎయిర్‌బస్ నుంచి కొనుగోలు చేయనుంది. విమానయాన సంస్థ 5వేల పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని నియమించుకోనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఎయిరిండియా, విస్తారా విలీనం తొలి దశలో ఉందని క్యాంప్‌బెల్ తెలిపారు. 2024 మార్చి నాటికి విలీనం పూర్తయి.. అనంతరం ఎయిరిండియా పేరుతోనే సేవలు కొనసాగుతాయన్నారు.

ఉమేష్ పాల్ హత్య కేసు నిందితుడు.. ఎన్‌కౌంటర్‌లో మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో శుక్రవారం దుండగుల కాల్పుల్లో మరణించిన ఉమేష్ పాల్ హత్య కేసు నిందితుల్లో ఒకడు పోలీస్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. ప్రయాగ్‌రాజ్‌లోని నెహ్రూ పార్క్ వద్ద నిందితుడు అర్బాజ్‌ను స్పెషల్ ఆపరేషన్స్ పోలీసులు సోమవారం గుర్తించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతడ్ని కాల్చి చంపారు.

ఉమేష్ పాల్ హత్య కోసం నిందితులను కారులో అతడు తరలించినట్లు పోలీసులు ఆరోపించారు. 2005లో హత్యకు గురైన బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ మర్డర్ కేసులో ఉమేష్ ప్రధాన సాక్షిగా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రయాగ్‌రాజ్‌లోని ఇంటి వద్ద కారు నుంచి దిగుతున్న ఆయనపై దుండగుడుల కాల్పులు జరిపారు. ఉమేష్ పాల్ శరీరంలోకి ఏడు బుల్లెట్లు దిగడంతో ఆయన చనిపోయారు.

సమస్యలపై ఆశాల ధర్నా



ప్రజాశక్తి - ధవళేశ్వరం(రాజమండ్రి)

సమస్యలపై కలెక్టరేట్ వద్ద మండుటెండలో ఆశాలు సోమవారం మహాధర్నా చేపట్టారు. రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు అపాలని, పని బారాన్ని తగ్గించాలని, వేతన బకాయిలు ఇవ్వాలని నినదించారు. అనంతరం కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. ధర్నానుద్దేశించి సిటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందరబాబు, బి.రాజులోవ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అన్నామణి, కె.పోశమ్మ, జిల్లా ట్రెజరర్ ఎం.వెంకటలక్ష్మి, నిడదవోలు పట్టణ గౌరవాధ్యక్షులు జె.రాంబాబు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశాలకు వేతనాలు ఇచ్చే విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయన్నారు. వేతనాలు తక్కువగా ఉన్నప్పుడు ఎవరూ ముందుకు రాకపోయినా పట్టించుకోని అధికారపార్టీ నాయకులు వేతనాలు పెరిగాక ఉన్నవారిని ఎలాగైనా తొలగించి తమవారికి పోస్టులు కట్టబెట్టేందుకు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కారుణ్య నియా మకాలు చేపట్టాలన్నారు. ఆశాలకు సంబంధం లేని పనులను అప్పగించడం తగదన్నారు. వ్యాక్సిన్ క్యాన్లు తీసుకు రమ్మని చెప్పడం, యూనిఫామ్ తెమ్మనడం వంటి పనులు అధికారులు చేస్తున్నారని, వాటిని మానుకోవాల న్నారు. పిహెచ్‌సిల్లో సమస్యల పరిష్కరానికి అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. దీంతో వారు ధర్నాను విరమించారు. సిఐటియు నాయకులు కెఎస్‌వి.రామచంద్ర రావు, ఎస్ఎస్.మూర్తి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు బి.ధనలక్ష్మి, నాగమణి, లక్ష్మి, మేరీ, సత్యవతి, లీల పాల్గొన్నారు.

పీఎం ఉజ్వల్ యోజన

పేదలకు ఉత్తచేయి..

- పథకం ప్రారంభించినప్పుడు వంటగ్యాస్ సిలిండర్ రూ.527
- ఇప్పుడు రూ.1153.. గణనీయంగా పడిపోయిన రీఫిల్ బుకింగ్
- సబ్సిడీగా ఇస్తామన్న రూ.200ని ఎగవేస్తున్న కేంద్రం

ఉజ్వల్ యోజన్ కింద వంటగ్యాస్ సిలిండర్ కనెక్షన్లు పొందిన పేదలు, వలస కార్మికులు తలపట్టుకుంటున్నారు. సిలిండర్ ధర భారీగా పెరగటం, సబ్సిడీ మొత్తం బ్యాంక్ ఖాతాల్లో పడకపోవటంతో 'రీఫిల్' బుక్ చేయటం పడిపోయింది. కనెక్షన్ తీసుకున్న తర్వాత నాలుగు అంతకన్నా తక్కువ సంఖ్యలో రీఫిల్ బుక్ చేసినవారు 56.5శాతం కాగా, ఒక్కసారి మాత్రమే కొనుగోలు చేసినవారు 11.3శాతం. పెరిగిన వంటగ్యాస్ ధరలు పేదలు, వలస కార్మికుల్ని ఎంతగా బెంబేలెత్తిస్తున్నాయో ఇది ప్రత్యక్ష ఉదాహరణ. పీఎం ఉజ్వల్ యోజన పథకం ప్రయోజనాలు, లక్ష్యాలు కేవలం కాగితాలకే పరిమితమైంది తప్ప, నిర్దేశించిన వర్గాల్ని ఆదుకోలేకపోయింది.



న్యూఢిల్లీ : కోట్లాది మంది పేదలు, వలస కార్మికుల్ని ఆదుకుంటున్నామని మోడీ సర్కార్ (మే 2016లో) ప్రారంభించిన పథకం 'పీఎం ఉజ్వల్ యోజన'. ఎన్నికల్లో ప్రచారం కోసం, పార్లమెంట్‌లో, బడ్జెట్ ప్రసంగాల్లో ఘనంగా చెప్పుకోవడానికి తప్ప ఇంత మోసపూరిత పథకం మరోటి లేదు. ఈ పథకం కింద దాదాపు 9.6కోట్ల ఉజ్వల్ యోజన (వంటగ్యాస్) కనెక్షన్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం సరఫరా అవుతున్న సబ్సిడీ వంటగ్యాస్ ధర రూ.1153లో సబ్సిడీ ఏమీ లేదు. పేరుకే ఇది సబ్సిడీ వంటగ్యాస్ సిలిండర్. ఉజ్వల్ కనెక్షన్లు తీసుకున్న పేదలు, వలస కార్మికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుందని మే 2022లో కేంద్రం రూ.200 సబ్సిడీ ఇస్తామని ప్రకటించింది. ఇది కూడా సమయానికి రావటం లేదని లబ్దిదారుల నుంచి ఫిర్యాదులన్నాయి. అందువల్లే సిలిండర్ రీఫిల్ చేయలేక పోతున్నామని వారు వాపోతున్నారు. కోట్లలో ఉజ్వల్ యోజన కనెక్షన్లను మంజూరుచేశామని కేంద్రం చెప్పుకోవటం తప్ప నిజమైన లబ్ది పేదలకు చేకూరటం లేదు. ఈ పథకం అమలుపై ఇటీవల బడ్జెట్ (2023-24) ప్రసంగం సందర్భంగా కేంద్రం గణాంకాలు విడుదల చేసింది. ఈ లెక్కల ప్రకారం, ఫిబ్రవరి 1, 2023 నాటికి దేశంలో ఉజ్వల్ యోజన కనెక్షన్లు 9.6 కోట్లున్నాయి. కనెక్షన్ పొందాక తిరిగి రెండోసారి రీఫిల్ బుక్ చేయని లబ్దిదారులు 9.6శాతం మంది ఉన్నారు. ఒక్కసారి మాత్రమే రీఫిల్ బుక్ చేసినవారు 11.3శాతం. నాలుగు అంతకన్నా తక్కువసార్లు రీఫిల్ బుక్ చేసిన లబ్దిదారులు 56.5శాతంగా ఉందని కేంద్రం తెలిపింది.

రీఫిల్ ఎందుకు బుక్ చేయటం లేదు?

కోట్లాది మంది పేదలు, వలస కార్మికులను ఎల్పీజీ వంటగ్యాస్ వైపు మరల్చడం ఉజ్వల్ యోజన పథకం ప్రధాన ఉద్దేశం. ఆ కుటుంబాల్లో కట్టెల పొయ్యి వాడకాన్ని పూర్తిగా తగ్గించటం. కేవలం ఈ వర్గాల్ని లక్ష్యంగా చేసుకొని పథకాన్ని రాష్ట్రాలు అమలుజేశాయి. పథకం ప్రారంభించిన 2016లో దేశమంతటా సిలిండర్ ధరలు సుమారుగా రూ.527 వద్ద ఉన్నాయి. ఇప్పుడు ఆ ధర రెట్టింపు అయ్యింది. హైదరాబాద్‌లో నేడు సబ్సిడీ సిలిండర్ ధర రూ.1150పైన్నే ఉంది. ఉజ్వల్ కనెక్షన్లకు రూ.200 రూపాయలు సబ్సిడీ ఇస్తామని ప్రకటించినా, సిలిండర్ రీఫిల్స్ పెరగటం లేదు. వంటగ్యాస్ ధరలు పేదలు, వలసకార్మికుల్ని ఎంతగా బెంబేలెత్తిస్తున్నాయో పై గణాంకాలే చెబుతున్నాయి. వాస్తవానికి కేంద్రం ఇస్తామంటున్న రూ.200 సబ్సిడీ సమయానికి లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమకావటం లేదు.

బడ్జెట్ ఏది?

సబ్సిడీతో కూడిన ఎల్పీజీ కనెక్షన్లకు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిన నిధులు కేవలం రూ.1లక్ష. నగదు బదిలీ కింద ఇవ్వాల్సిన సబ్సిడీకి కేటాయించిన నిధులు రూ.180 కోట్లు. క్రితం బడ్జెట్‌లో (2022-23) రూ.4వేల కోట్లు ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. దీని ప్రకారం 95.5శాతం నిధులు తగ్గాయి.

డాక్టర్ రెడ్డీస్ చేతికి మేనే

హైదరాబాద్ : ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ తాజాగా ఆస్ట్రేలియాకు చెందిన మేనే ఫార్మా గ్రూపునకు చెందిన అమెరికా జెనరిక్ ప్రిస్కిప్షన్ ప్రొడక్ట్ పోర్టుపోలియోను స్వాధీనం చేసుకోనుంది. దీని కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఇందుకోసం 105 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.860 కోట్ల) చెల్లింపులు చేయనుంది. మేనే ఫార్మా అమెరికా జెనరిక్స్ ప్రిస్కిప్షన్ ప్రొడక్ట్ పోర్ట్‌పోలియోలో సుమారు 85 జెనరిక్ ఉత్పత్తులు ఉన్నాయి. మేనే ఫార్మా దక్కడంతో రోగులకు తక్కువ ధరలకే మందులను అందించడానికి వీలుందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది.

కొత్త ఇంజిన్‌తో హ్యుందాయ్ అల్కజార్

న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ తన అల్కజార్ మోడల్‌ను కొత్త ఇంజిన్‌తో ఆవిష్కరించినట్లు తెలిపింది. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌తో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ వేరియంట్ కోసం రూ.25,000తో బుకింగ్స్ ప్రారంభించినట్లు పేర్కొంది. మ్యాన్యువల్ వెర్షన్ లీటర్‌కు 17.5 కిలోమీటర్ల మైలజీని అందించగా, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ వెర్షన్ 18 కిలోమీటర్ల మైలేజ్ అందిస్తుందని తెలిపింది. కొత్త హ్యుందాయ్ అల్కజార్ ఐడిల్ స్టార్ట్ అండ్ గో ఫంక్షన్‌తో కూడా వస్తుందని పేర్కొంది. దీంతో ఎక్కువ ట్రాఫిక్ ఉన్న సమయంలో కొంత ఇంధనాన్ని అదా చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపింది.

ఎస్‌డిజి సాధించకపోతే అంతే !

- ఆరోగ్య రంగంపై తీవ్ర ప్రభావం
- యూఎన్ఓ 33 సూచికల్లో 19 భారత్ లక్ష్యంలో లేవు
- 'ది లాన్సెట్' అధ్యయనం హెచ్చరిక



న్యూఢిల్లీ : భారత సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) విషయంలో 'ది లాన్సెట్' అధ్యయనం కీలక విషయాన్ని వెల్లడించింది. భారత్‌లో తక్కువగా అంచనా వేయబడిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పలు సూచికలు దేశ ఆరోగ్య రంగంపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయని పేర్కొన్నది. 2030 నాటికి ఈ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైతే ఆరోగ్య రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. ది లాన్సెట్ రీజినల్ హెల్త్ దక్షిణాసియా జర్నల్‌లో ఒక అధ్యయనాన్ని ప్రచురించింది.

దీని ప్రకారం.. 2030 నాటికి భారత్ ఎస్‌డీజీని సాధించగలదా లేదా అన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి ఐక్యరాజ్య సమితి అమలు చేసిన 33 సూచికలలో 19 సూచికలను చేరుకోవడం భారత లక్ష్యంలోనే లేదు. ఈ 19 సూచికలలో మూడింటిని ఎప్పటికీ సాధించలేమని సూచిస్తుంది. స్త్రీలలో (అందరు, గర్భిణీలు, గర్భిణీయేతర స్త్రీలు) రక్తహీనతను సగానికి తగ్గించడం ఇందులో ఒకటి. ఎస్‌డీజీ లక్ష్యాలు 2030 వరకు పునరుత్పత్తి వయస్సు గల మహిళల్లో రక్తహీనత ప్రాబల్యాన్ని సగానికి తగ్గించాలని భావించాయి. 2016-21 మధ్య ఈ సమస్య ప్రాబల్యం పెరిగింది. ఈ ట్రెండ్ కొనసాగితే లక్ష్యాలు సాధించలేనివిగా మారొచ్చు. ప్రస్తుతం సగానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. అయితే, భారత లక్ష్యం దీనిని 2030 నాటికి 23.57 శాతానికి తగ్గించడానికి మాత్రమే పరిమితమై ఉన్నది.

కొన్ని లక్ష్యాలను సాధించడానికి దశాబ్దాల కాలం

భారత్ 2030 గడువును కోల్పోతుందని అంచనా వేసిన ఇతర 16 సూచికలలో కొన్నిటిని కొన్ని సంవత్సరాల తర్వాత సాధించవచ్చు. మరికొన్ని దశాబ్దాలు పట్టవచ్చు. 2016-21 మధ్య ప్రస్తుత మార్పు రేటును పరిశీలిస్తే భారత్ 2031 నాటికి మెరుగైన నీటి లభ్యత, 2033 నాటికి చేతులు కడుక్కోవడం, 2035 నాటికి వంట చేయడానికి స్వచ్ఛమైన ఇంధనం వంటి లక్ష్యాలను చేరుకోగలదని ఈ అధ్యయనంలో అంచనా వేశారు. ఇతర 11 సూచికలు 2041-2162 మధ్య సాధించే అవకాశం ఉన్నది. వీటిలో ప్రాథమిక సేవల అందుబాటు (2047), పురుషులలో పొగాకు వాడకం తగ్గింపు (2050), భాగస్వామి హింస తగ్గింపు (2090), వృథా మరియు అధిక బరువు తగ్గడం (2162) వంటివి ఉన్నాయి.

మరుగుదొడ్లు లేక 19 శాతం మంది ప్రజలు..

భారత్‌లో 19 శాతం మంది ప్రజలు బహిరంగ మలవిసర్జనను ఆచరిస్తున్నారనీ, ఒడిశా, బీహార్, జార్ఖండ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో 30 శాతం మందికి మరుగుదొడ్లు లేవని ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5ను ఇది ఎత్తి చూపింది. 2019 అక్టోబర్‌లో భారత్‌ను బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రధాని మోడీ ప్రకటించడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ గురించి వివరిస్తూ.. ఆరోగ్యంపై 60 శాతం ఖర్చు భారత్‌లో జేబు నుంచి ఖర్చు చేయబడుతుందని చెప్పడంతో ఇది ప్రాముఖ్యతను సంతరించుకున్నది. లింగ హింస, మహిళా సాధికారతకు సంబంధించిన చట్టాలు, న్యాయ ప్రక్రియలు, బేటీ బచావో బేటీపడావో, మహిళా శక్తి కేంద్రం, మహిళలకు సంబంధించిన ఇతర పథకాలపై ఎక్కువ శ్రద్ధ అవసరం అని వివరించారు.

అధిక సూచీలను సాధించిన కేరళ జిల్లాలు

33 ఎస్‌డీజీ సూచీల్లో అధికంగా 13 సూచీలను సాధించినవిగా కేరళలోని ఎర్నాకుళం జిల్లా, కేంద్రపాలిత ప్రాంతం లక్షద్వీప్‌లు ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 13 వరకు సూచికలను సాధించిన జిల్లాలు అధికంగా కేరళతో పాటు తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలలో ఉన్నాయి. 94 జిల్లాలు 8 సూచికలను సాధించాయి. ఆ జిల్లాలు కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి ఉన్నాయి. ఇక మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల ప్రదర్శన చాలా దారుణంగా ఉన్నది. దాదాపు 171 జిల్లాలను కలిగి ఉన్న ఈ రాష్ట్రాలు రెండు లేదా అంతకంటే తక్కువ ఇండికేటర్ల లక్ష్యాన్ని మాత్రమే సాధించాయి. యుక్త వయసులో గర్భం దాల్చడం, చిన్నారుల్లో వ్యాధి నిరోధకత, మహిళలకు బ్యాంకు ఖాతాలను తెరవడం, ఇంటర్నెట్ వినియోగం, పారిశుధ్యం మెరుగుదల, జనన నమోదు, బహుమితీయ పేదరికం తగ్గింపు, విద్యుత్ సదుపాయం, మహిళల్లో పొగాకు వినియోగం, బాల్య వివాహాలు తగ్గడం, ఐదు ఏండ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల మరణాల తగ్గుదల వంటివి జాతీయ స్థాయిలో లక్ష్యాల్లో ఉన్నాయి.

మాజీ మంత్రి నారాయణ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రశ్నాపత్రాల లీకేజీ కేసును సెషన్స్ కోర్టులో విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. 2022 పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో రాష్ట్ర మాజీ మంత్రి పి నారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. బెయిల్ రద్దు చేస్తూ ఎపి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ రవీంద్రభట్, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పిటిషనర్ మంత్రిగా ఉన్నారని, 2014లోనే నారాయణ విద్యాసంస్థల అధినేతగా వైదొలిగారని పిటిషనరు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా కోర్టుకు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సెషన్స్ కోర్టులో విచారణ చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది. సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై వారం రోజుల్లో హైకోర్టును ఆశ్రయించే అవకాశాన్ని కల్పిస్తున్నామని, అప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని సుప్రీం కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

గతేడాది చిత్తూరు జిల్లాలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో అరెస్టయిన నారాయణకు స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేయగా... దాన్ని సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టులో పిటిషన్ వేశారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన కోర్టు నారాయణకు బెయిల్ రద్దు చేస్తూ రిమాండ్‌కు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై నారాయణ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రస్తుతం నారాయణ బెయిల్‌పై ఉన్నారు.

అయ్యన్నపై ఫోర్జరీ కేసు దర్యాప్తునకు సుప్రీం అనుమతి

- హైకోర్టు తీర్పు కొట్టివేత

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుపై ఫోర్జరీ కేసు దర్యాప్తునకు సుప్రీం కోర్టు అనుమతినిచ్చింది. అయ్యన్నపాత్రుడుపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అయ్యన్నపై ఫోర్జరీ కేసు దర్యాప్తునకు అనుమతినిస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఫోర్జరీ సెక్షన్ల ఐపిసి 467 కింద దర్యాప్తు చేయవచ్చని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. కేసు దర్యాప్తు సమయంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై సుప్రీం అసంతృప్తి వ్యక్తం చేసింది.

బిల్డింగ్ ప్లాను విషయంలో సంతకాలు ఫోర్జరీ చేశారన్న కేసులో అయ్యన్నపాత్రుడుపై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ప్రధాన కేసును మెరిట్ ఆధారంగా విచారణ చేయాలని హైకోర్టుకు సుప్రీం కోర్టు సూచించింది. ఫోర్జరీ చేసి ఎన్‌ఒసి తీసుకున్నారని సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ అధికారి పిటిషన్ దాఖలు చేశారు. తన ఇల్లు నిర్మించే క్రమంలో నీటి పారుదలశాఖ అధికారి సంతకాలు ఫోర్జరీ చేశారని అయ్యన్నపాత్రుడుపై రాష్ట్ర ప్రభుత్వం ఆరోపణలు చేసింది.

మజ్లిస్ ఎంపి అసదుద్దీన్ వియ్యంకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఎంపి, ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసి వియ్యంకుడు డాక్టర్ మజార్ అలీ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని నివాసంలో తుపాకీతో పాయింట్ బ్లాంక్‌లో కాల్చుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మజార్ అలీని అపోలో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ తగాదాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా ఖుష్బూ

న్యూఢిల్లీ: బిజెపి నాయకురాలు, సినీ నటి ఖుష్బూ సుందర్‌ను జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా కేంద్రం నామినేట్ చేసింది. జాతీయ మహిళా కమిషన్ సభ్యులుగా మొత్తం ముగ్గురిని నామినేట్ చేస్తున్నట్టు కేంద్ర మహిళా శిశు అభివద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఖుష్బూ ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. మహిళా కమిషన్ సభ్యులుగా నామినేట్ అయిన వారిలో ఖుష్బూతో పాటు మమత కుమారి, డెలియానా కొంగ్డుప్ ఉన్నారు.

సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితుడు సునీల్ యాదవ్‌కు బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. సునీల్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను సిజె నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. సునీల్ యాదవ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు సిబిఐ, వైఎస్ సునీతా వేసిన ఇంప్లీడ్ పిటిషన్లపైనా హైకోర్టులో సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. ఆర్టికల్-21 ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ హరిస్తున్నారని.. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా జైలులో ఉంచాల్సిన అవసరం లేదని సునీల్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు.

ఉక్రెయిన్‌లో జోక్యాన్ని నిరసిస్తూ

జర్మనీ, ఫ్రాన్స్‌లో భారీ ర్యాలీలు



ఫ్రాన్స్‌లో నిరసన ర్యాలీకి హాజరైన ప్రజలు

బెర్లిన్, పారిస్ : ఉక్రెయిన్ సంక్షోభంలో తమ దేశ ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడానికి వ్యతిరేకంగా జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పెద్దయెత్తున నిరసన ర్యాలీలు జరిగాయి. జర్మనీ రాజధాని బెర్లిన్‌లో బ్రాండెన్‌బర్గ్ గేట్ వద్ద ఈ నెల 25న 'శాంతి కోసం తిరుగుబాటు' పేరుతో నిర్వహించిన ర్యాలీకి మంచి స్పందన లభించింది. . ఉక్రెయిన్‌లో యుద్ధం ముగింపునకు చర్చలను ప్రోత్సహించడంలో దేశ ఛాన్సలర్ ఒలాఫ్ షుల్జ్ క్రియాశీల పాత్ర పోషించాలని వేలాది మంది జర్మన్లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉక్రెయిన్‌కు అధునాతన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పంపిణీ చేస్తూ సంక్షోభాన్ని మరింత పెంచడానికి బదులుగా చర్చలు, దౌత్యం, శాంతి కోసం కృషి చేయాలని కోరారు. ఈ ర్యాలీలో లెఫ్ట్ పార్టీ ఎంపి సహ్రా వాగెనెంచ్, రిటైర్డ్ బ్రిగేడియర్ జనరల్ ఎరిచ్ వాద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. యుద్ధం కోసం కాదు శాంతి చర్చల కోసం బలమైన కూటమిని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ర్యాలీకి ఒక రోజు ముందు కూడా ఇదే ప్రాంతంలో బెర్లిన్ పీస్ కో ఆర్డినేషన్, జర్మన్ కమ్యూనిస్ట్ పార్టీ, ఇతరులు శాంతి కోసం పిలుపునిస్తూ భారీ ర్యాలీ చేశాయి.

ఉక్రెయిన్‌కు ఫ్రాన్స్ నిరంతర మద్దతును వ్యతిరేకిస్తూ రాజధాని పారిస్‌తో పాటు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వరసగా రెండో వారం కూడా సామూహిక నిరసనలు జరిగాయి. పారిస్‌లో ఆదివారం జరిగిన నేషనల్ మార్చ్ ఫర్ పీస్ కార్యక్రమంలో గత వారం కంటే అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ వారం సుమారు 10 వేల మంది హజరైనట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా మరో 30 ప్రాంతాల్లో కూడా నాటో వ్యతిరేక నిరసనలు జరిగాయి.

అమెరికా నేతృత్వంలోని నాటో నుంచి, ఇయు నుంచి ఫ్రాన్స్ బయటకు రావాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రస్తుత అధ్యక్షులు మాక్రాన్ గెట్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాటో, ఇయు జెండాలను దగ్ధం చేశారు.

రాజధాని కేసుల విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ప్రాంతంలో ప్లాట్లను అభివృద్ధి చేసి ఇవ్వనందుకు నష్టపరిహారం ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వానికి, సిఆర్‌డిఎకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ వాయిదా పడింది. వేసవి సెలవుల తర్వాత విచారణ చేస్తామని ప్రకటించింది. అదే విధంగా, రాజధాని అమరావతి ఏరియాలో ఇతర ప్రాంతాల వారికి, పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులకు వీలుగా సిఆర్‌డిఎ చట్టంలో సవరణలు చేయడాన్ని సవాల్ చేసిన కేసులను కూడా అప్పుడే విచారణ చేస్తామని స్పష్టం చేసింది. చట్ట సవరణ చేసిన కేసుల్లో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సిఆర్‌డిఎకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ప్రకటించింది. సిఆర్‌డిఎ చట్ట సవరణను సవాల్ చేస్తూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాలను, ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వాలన్న హైకోర్టు ఉత్తర్వుల్ని అమలు చేయలేదంటూ రైతులు దోనె సాంబశివరావు తదితరులు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాలను సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది.

హైకోర్టుకు డిజిపి

కోర్టు ధిక్కార కేసులో డిజిపి కె రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం హైకోర్టుకు హాజరయ్యారు. విచారణను మార్చి 20కు వాయిదా వేస్తున్నామని, ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని డిజిపిని హైకోర్టు ఆదేశించింది. నాటి డిజిపి, ఎపిపిఎస్‌సి ఛైర్మన్ గౌతం సవాంగ్ అధికార విధుల కారణంగా హాజరుకాలేకపోతున్నట్లు తెలియజేశారు. తదుపరి విచారణకు హాజరవుతామని రాతపూర్వక హామీని అమలు చేయాలని జస్టిస్ ఎం గంగారావు ఆదేశించారు. విజయనగరం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు 1999లో జారీ చేసిన జిఓ 257 మేరకు ప్రమోషన్ కల్పించాలని 2019లో ఇచ్చిన ఆదేశాలు అమలు చేయలేదని దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టు విచారణ జరిపింది.

సింగిల్ జడ్జి విచారణపై స్టే

ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణాల్ని నిలిపివేస్తూ.. సింగిల్ జడ్జి చేస్తున్న విచారణను నిలిపివేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రావు రఘునందన్‌రావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విచారణను మార్చి 28కి వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అవకతవకలు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయని ఎన్నికల సంఘానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతోందని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు సోమవారం లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు, కోర్టు తీర్పులను పాటించకుండా అన్ని రకాల ఎన్నికలను ఏకగ్రీవం చేయడంలో పోలీసులు, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడం శోచనీయమని తెలిపారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసులను, అధికారులను అడ్డుపెట్టుకుని ఏ అభ్యర్థులూ పోటీ చేయకుండా అధికార పార్టీ కిడ్నాప్‌లకు, చిత్రహింసలకు గురిచేసి ఏకగ్రీవం అని ప్రకటించిందని తెలిపారు. అదే పంథాలో ప్రస్తుతం రాష్ట్ర శాసనమండలి ఎన్నికలు జరగడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల నియోజకవర్గాలకు జరుగుతున్న ఎన్నికల్లో కొందరు రిటర్నింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను తోసిపుచ్చారని తెలిపారు. నెల్లూరు, తూర్పు గోదావరి, కడప జిల్లాల్లో అభ్యర్థులను ప్రతిపాదించిన వారి సంతకాలు వారివి కావని చెప్పి బలవంతంగా నామినేషన్లను తిరస్కరించారని వివరించారు. కర్నూలు జిల్లాలో ప్రతిపాదన చేసిన వారిలో నలుగురిని అర్ధరాత్రి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకొచ్చి చితకబాది సంతకాలు వారివి కాదని స్టేట్‌మెంట్ తీసుకున్నారని పేర్కొన్నారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోనూ నామినేషన్ తిరస్కరించారని తెలిపారు. నామినేషన్‌లను తిరస్కరించడం ఎన్నికల కమిషన్ నియమావళికి పూర్తి విరుద్ధమన్నారు. వీటిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

ఐదు స్థానిక సంస్థల ఎమ్మెల్సీలు ఏకగ్రీవం


మేరుగ మురళీధర్, మంగమ్మ, రామసుబ్బారెడ్డి, సూర్యనారాయణరావు, సిపాయి సుబ్రహ్మణ్యం,

ప్రజాశక్తి - యంత్రాంగం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి కుడుపూడి సూర్యనారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారికంగా ప్రకటించారు. టిడిపి మద్దతో నామినేషన్ వేసిన వేలూరి రంగయ్య నామినేషన్ స్క్రూటినీలో తిరస్కరణకు గురవ్వడంతో అనంతపురం నుంచి మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప నుంచి రామసుబ్బారెడ్డి, చిత్తూరు నుంచి సిపాయి సుబ్రహ్మణ్యం, నెల్లూరు నుంచి మేరుగ మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొమ్మిది స్థానిక సంస్థల నియోజకవర్గాలకు గాను ఐదు స్థానాలను వైసిపి ఏకగ్రీవంగా గెలుచుకుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. శ్రీకాకుళం, కర్నూలు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప - అనంతపురం-కర్నూలుకు ఎన్నికలు జరగనున్నాయి. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు, కడప-అనంతపురం- కర్నూలు, శ్రీకాకుళం- విజయనగరం-విశాఖపట్నానికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు మార్చి 13న ఎన్నికలు జరుగుతాయి. అనంతపురం, కడప, కర్నూలు పశ్చిమరాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీకి 49 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది బరిలో నిలిచారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థి బి.రామగోపాల్‌రెడ్డి భార్య భూమిరెడ్డి ఉమాదేవి, వెన్నపూస వెంకట మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులు చింతకుంట రమేష్, ఎంవి.శ్రీదేవి ఉపసంహరించుకున్నారు. పశ్చిమ రాయలసీమ పిడిఎఫ్ అభ్యర్థులుగా పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి, తూర్పు రాయలసీమ నుంచి పి.బాబిరెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ కోరెడ్ల రమాప్రభ బరిలో ఉన్నారు.

నేపాల్‌లో మళ్లీ సంక్షోభం

- ప్రభుత్వానికి ఓలి పార్టీ మద్దతు ఉపసంహరణ
- నేపాలీ కాంగ్రెస్ మద్దతుతో ప్రస్తుతానికి బయటపడ్డ ప్రచండ



ఖాట్మండు: నేపాల్ మరోసారి రాజకీయ సంక్షోభంలో చిక్కుకుంది. ప్రధాని పుష్ప కమల్ దాహల్ (ప్రచండ) నేతృత్వంలోని ప్రభుత్వానికి సిపిఎన్ (యుఎంఎల్) మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు సోమవారం ప్రకటించడంతో సంక్షోభం తలెత్తింది. 275 స్థానాలు ఉన్న పార్లమెంటులో 79 సీట్లతో కెపి ఓలి నాయకత్వంలోని సిపిఎన్ (యుఎంఎల్) రెండవ అతి పెద్ద పార్టీగా ఉన్న సంగతి తెలిసిందే. సిపిఎన్ (యుఎంఎల్) ఉపాధ్యక్షుడు బిష్ణు రైజాల్ ఇక్కడ పిటిఐతో మాట్లాడుతూ, నేపాల్ అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ (నేపాలీ కాంగ్రెస్) అభ్యర్థికి మావోయిస్టు పార్టీ మద్దతు ప్రకటించడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని అన్నారు. 89 స్థానాలతో పార్లమెంటులో ఏకైక అతి పెద్ద పార్టీగా ఉన్న నేపాలీ కాంగ్రెస్ ఆయనకు మద్దతు తెలపడంతో ప్రచండ ప్రభుత్వానికి తక్షణం వచ్చే ముప్పేమీ లేదు.ప్రధాని ప్రచండ ఏడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు డిసెంబరు25న కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడమే కాదు, సిపిఎన్ (యుఎంఎల్)కు ద్రోహం చేశారని రైజాల్ పేర్కొన్నారు. ఉప ప్రధానితో సహా ఎనిమిది మంది యుఎంఎల్ మంత్రులు ప్రచండ ప్రభుత్వం నుంచి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. టివి జర్నలిస్టు రవి లామిచానే నాయకత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఈ ప్రభుత్వానికి తమ మద్దతు కొనసాగించాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ లీడర్ బిరాజ్ భక్త శ్రేష్ఠ చెప్పారు.

పార్లమెంటులో ప్రస్తుతానికి వివిధ పార్టీల బలాబలాలు ఇలా ఉన్నాయి. నేపాలీ కాంగ్రెస్ (ఎన్‌సి)-89, సిపిఎన్ (యుఎంఎల్)-79, ప్రచండ నేతృత్వంలోని సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) -32, మాజీ ప్రధాని మాధవ కుమార్ నేతృత్వంలోని సిపిఎన్ (యునైటెడ్ సోషలిస్టు) -10, రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ-20, జనమత్ పార్టీ-6, లోక్‌తాంత్రిక్ సమాజ్‌వాది పార్టీ -4, నాగరిక్ ఉన్‌ముక్తి పార్టీ -3 స్థానాలు కలిగి ఉన్నాయి. ప్రచండ ప్రభుత్వం నిలబడాలంటే కనీసం 138 మంది ఎంపీల మద్దతు అవసరం కాగా ప్రస్తుతం ఆయనకు 141 మంది మద్దతు ఉంది. .ప్రచండకు మద్దతు ఇస్తున్న మూడు ప్రధాన పార్టీలు -ఎన్‌సి, సిపిఎన్ మావోయిస్టు సెంటర్, ఆర్ఎస్‌పి రాజకీయంగా భిన్న ధ్రువాలు కలిగినవి. వీటి మద్దతుపై ఆధారపడిన ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగే స్థితి లేదని పలువురు రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రచండ వచ్చే నెల రోజుల్లో పార్ల మెంటులో విశ్వాస పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజ్యాంగ నిపుణులు పేర్కొన్నారు.

కదిరి ఘటనలో పలువురిపై కేసు నమోదు

- నలుగురు జర్నలిస్టులపైన నాన్‌బెయిలబుల్ కేసులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఈ నెల 25వ తేదీన జరిగిన ఘటనపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం కానుండడంతో శనివారం దేవళం వీధిలో దుకాణాల ముందు రేకులు ఆక్రమణల తొలగింపునకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు, స్థానిక టిడిపి కౌన్సిలర్ సుధారాణి మధ్య వివాదం మొదలైంది. సుధారాణిని కించపరుస్తూ అసభ్యంగా సిఐ మాట్లాడడంతో సమస్య పెద్దది అయ్యింది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అదే రోజు సాయంత్రం సిఐ ఇంటి ముందు ధర్నా చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ పెద్ద ఎత్తున ఉద్రిక్తత నెలకొన్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసులకు ఉపక్రమించారు. శనివారం రాత్రి సిఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటప్రసాద్‌తో పాటు పలువురు టిడిపి నాయకులపై పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. వీరితో పాటు తమ విధులకు ఆటంకం కలిగించారంటూ నలుగురు జర్నలిస్టులపైనా పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు.

పట్టణ సిఐ మధుపైనా కేసు నమోదు

సుధారాణిని కించపరుస్తూ మహిళలపై లాఠీఛార్జి, కులంపేరుతో దూషించడం లాంటి వాటిపై బొల్లి ప్రేమలత ఫిర్యాదు చేశారు. సిఐ మధు, వైసిపికి చెందిన పలువురుపై కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

కదిరి సిఐపై చర్యలు తీసుకోండి : ఎపిడబ్ల్యుజెఎఫ్

కదిరి పట్టణంలో తెలుగుదేశం, వైసిపి మధ్య జరుగుతున్న ఘర్షణ వార్తలను కవర్‌చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టిన కదిరి సిఐపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ అంశంలో రాష్ట్ర డిజిపి జోక్యం చేసుకుని తక్షణం సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎపి వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎ షఫివుల్లా, ప్రధాన కార్యదర్శి ఆర్ రామాంజినేయులు వేరొక ప్రకటనలో డిమాండ్ చేశారు.



క్రైస్తవ ఆస్తుల రక్షణకు చర్యలు

- సమస్యల పరిష్కారానికి సలహాదారు
- క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో సిఎం జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో క్రైస్తవ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో సిఎం జగన్ సోమవారం భేటీ అయ్యారు. ముందుగా రాష్ట్రంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను సిఎంకు వారు వివరించారు. చారిటీ సంస్థలు నడుపుతున్న వారికి స్థానిక పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమస్యలకు జిల్లా స్థాయిలోనే ఒక పరిష్కారం చూపుతామని సిఎం పేర్కొన్నారు. ఎస్‌పిలు, కలెక్టర్లు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇకపై క్రైస్తవ సమాజం, సంఘాల ప్రతినిధుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు ఒక సలహాదారును నియమిస్తామన్నారు. ఈ ప్రక్రియతో క్రైస్తవుల సమస్యలను సులభంగా పరిష్కరించే వెసులుబాటు వస్తుందని తెలిపారు. క్రైస్తవులకు సంబంధించిన శ్మశానవాటికల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

జగనన్న విద్యా దీవెన రాలేదని

తరగతుల నుండి గెంటివేత

- 'ఎన్‌బికెఆర్' నిర్వాకం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'జగనన్న విద్యాదీవెన' నుండి సకాలంలో ఫీజులు విడుదల కాకపోవడంతో తరగతి గదుల నుండి విద్యార్థులను గెంటివేసిన ఉదంతమిది. నెల్లూరు జిల్లా విద్యానగర్‌లోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి (ఎన్‌బికెఆర్) ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. తరగతులకు అనుమతించకపోవడంతో విద్యార్థులు రోజంతా హాస్టల్ గదులకు పరిమితమయ్యారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి కుమారుడు, ప్రస్తుతం తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షుడైన నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఈ కళాశాలకు ఛైర్మన్ కావడం గమనార్హం. విశ్వసనీయ సమాచారం ప్రకారం మూడో సంవత్సరం ఇంజినీరింగ్‌కు చెందిన ఇసిఇ లోని 10 మంది, సిఎస్‌ఇలో 13 మంది, మెకానిక్ 20 మంది, సివిల్ 12 మంది ఐటి అండ్ ఎఐడిఎస్ 6 మందితో పాటు పలువురిని తరగతుల నుండి బయటకు పంపారు. ఇలా బయటకు వచ్చిన వారు వందల సంఖ్యలోనే ఉన్నారని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. జగనన్న విద్యాదీవెనక పథకం నుండి ఫీజులు రాలేదు కనుక విద్యార్థులే చెల్లించాలని, అప్పటి వరకు క్లాసులకు హాజరు కావడానికి వీలులేదని చెప్పినట్లు తెలిసింది. కళాశాల బయట నిలుచుని డైరెక్టర్, హెచ్‌ఒడిని ప్రాధేయపడినా ఫలితం కనిపించలేదు. దీంతో కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి భోరున విలపించారు. సోమవారం నాడు వారిని హాస్టల్‌కు అనుమతించినప్పటికీ, ఫీజులు చెల్లించకుంటే అక్కడి నుండికూడా పంపేస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యాహక్కుకు అమ్మఒడే పరిష్కారమా?

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాహక్కు చట్టానికి అమ్మఒడే పరిష్కారమా? అని సిఎం వైఎస్ జగన్‌ను టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్కాలర్ షిప్స్ చెల్లించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తుంటే అమ్మఒడి ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు కేటాయించి, నిధులు చెల్లించాలని కోరుతుంటే.. దీనికి సైతం అమ్మఒడి అంటూ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు వెంటనే ఇవ్వాలి

- సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి - పశ్చిమ యంత్రాంగం

టిడ్కో ఇళ్లను తక్షణం అప్పగించాలని, జగనన్న ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. జగనన్న ఇళ్లకు ఆర్థిక సాయం రూ.ఆరు లక్షలకు పెంచాలని నినాదాలు చేశారు.సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్, ఆయా మండలాల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి బి. బలరాం మాట్లాడుతూ..భీమవరం పట్టణంలో 82 ఎకరాల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ శాతం నిర్మాణం పూర్తి చేశారని, ఆ ఇళ్లను వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులకు అందించలేకపోయిందని అన్నారు. మౌలిక సదుపాయాలు, కనీస వసతులు కూడా కల్పించలేని దౌర్భగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. అనంతరం డిఆర్‌ఒ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఉండి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. మండలంలో 2,473 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు అందజేయగా వారికి స్థలాలు చూపించడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆచంట, తాడేపల్లిగూడెం, కాళ్ల, పెనుమంట్ర, పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. యలమంచిలి, తణుకులో ధర్నాచేపట్టారు.

మధ్యాహ్న భోజనం తిన్న

16 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - తణుకు, తణుకు రూరల్

పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నంబర్ ఆరులో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు సోమవారం అస్వస్థతకు గురైన ఘటన కలకలం సృష్టించింది. మధ్యాహ్న భోజనంలో పొంగల్, కోడిగుడ్డు తిన్న 31 విద్యార్థుల్లో సుమారు 16 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు చేసుకున్న ఐదుగురు విద్యార్థులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత ముగ్గురిని, ఆపై ఏడుగురిని, తర్వాత మరొకరిని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఎటువంటి అపాయమూ లేదని తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో తిన్న గుడ్డు, పొంగలి జీర్ణం కాక వికారం, వాంతులయ్యాయని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడటంతో సాయంత్రం ఇంటికి పంపించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆరా తీశారు. ఆ పాఠశాలలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేస్తున్నట్లు ఎంఇఒ ఎస్.శ్రీనివాసరావు ప్రకటించారు.

వైసిపి, జనసేన నేతల మధ్య వాగ్వివాదం

విద్యార్థుల అస్వస్థత విషయం తెలుసుకున్న వైసిపి నేత, మాజీ ఎఎంసి చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, పట్టణాధ్యక్షులు మంగెన సూర్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దాట్ల సుందరరామరాజు విద్యార్థులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే సమయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామచంద్రరావు ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న వైసిపి నేతలకు, జనసేన నేతల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది.

పునరావృతం కాకుండా చూడాలి: సిపిఎం

మధ్యాహ్న భోజనం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. విద్యార్థులను పరామర్శించి జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

'అగ్నిపథ్'కు ఢిల్లీ హైకోర్టు సమర్థన

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకాన్ని ఢిల్లీ హైకోర్టు సోమవారం సమర్థించింది. రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఈ పథకం జాతీయ భద్రత ప్రాతిపదికన తీసుకున్న విధాన నిర్ణయమని ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్‌చంద్రశర్మ నేతృత్వంలోని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ పథకంలో కోర్టు జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం లేదని తెలిపింది. 2019 రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్/ ప్రకటనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను కొట్టివేసింది. గతేడాది డిసెంబర్ 15న వాదనలను విన్న అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. సాయుధ దళాల రిక్రూట్ మెంట్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాలకు సంబంధించి అగ్నిపథ్ పథకాన్ని గతేడాది జూన్‌లో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో యువతలో ఆగ్రహావేశాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.



మీకోసం

గోధుమ పిండిలో కొద్దిగా పాలు లేదా నూనె వేసి కలిపితే చపాతీలు మృదువుగా వస్తాయి.

జీవన సౌరభం

చేయాల్సిన పనిని ఎప్పుడూ వాయిదా వేసుకుంటూ పోతే సాధించే ఆలోచన వెనక్కుపోతుంది.

విజ్ఞాన దినోత్సవం




పిల్లలూ, ఈ రోజు సైన్సు డే. ఈ సందర్భంగా విజ్ఞానం గురించి, దాని విశేషాలు తెలుసుకుందామా!

జాతీయ విజ్ఞాన దినోత్సవం మనదేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జరుపుకుంటారు. 'రామన్ ఎఫెక్ట్'ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్నారు. ఆయన గుర్తుగా ఈ రోజును నేషనల్ సైన్స్ డేగా జరుపుకుంటాం. ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో (చెదురుతాయో) తెలిపే పరిశోధన ఫలితాన్నే రామన్ ఎఫెక్ట్ అంటారు. రామన్ ప్రభావం అంటే ఏమిటో అర్థం చెసుకోవడం అంత తేలిక కాదు.

కాంతి ఒక పదార్థం మీద పడ్డప్పుడు ఆ కాంతిలోని కిరణాలు ఆ పదార్థంలోని అణువులని, పరమాణువులని గుద్దుకుంటాయి. గోడ మీదకి బంతిని విసిరితే ఆ బంతి పరావర్తనం చెంది వెనక్కి వస్తుంది. ఇదే విధంగా కాంతి ఒక యానకంలోని రేణువులని, గుద్దుకున్నప్పుడు ఆ కాంతి కిరణాలు పరావర్తనం చెంది వెనక్కి వస్తాయి. కాంతి కిరణంలోని తేజాణువులని (ఫోటానులని) రంగు బంతులతో పోల్చవచ్చు. ఏ 'రంగు బంతిని' యానకం మీదకి విసిరేమో అదే రంగు బంతి తిరిగి వస్తే దానిని రేలీ పరిక్షేపం అంటారు. అనగా, ఏ రంగు కిరణం లోపలికి వెళితే అది పరావర్తనం చెంది అదే రంగుతో బయటకి వస్తే ఆ ప్రక్రియని రేలీ పరిక్షేపం అంటారు. రామన్ గమనించినది ఏమిటంటే! ఒక కోటి తేజాణువులని యానకం మీదకి వదిలితే అందులో ఒకటో రెండో రంగు మారి బయటకి వస్తున్నాయి. భౌతిక శాస్త్రంలో కాంతి కెరటం యొక్క తరంగ దైర్ఘ్యం రంగుని సూచిస్తుంది. అంటే పతనమైన కాంతి కిరణం ఒకటైతే పరావర్తనం చెంది తిరిగి వచ్చిన కిరణాలలో కొన్నింటి తరంగ దైర్ఘ్యం (రంగు) తేడాగా ఉంటోంది. ఈ దృగ్విషయానికి రామన్ ప్రభావం అని పేరు పెట్టేరు.

రామన్ ప్రభావం మొట్టమొదటిసారిగా ప్రయోగశాలలో ప్రత్యక్షంగా చూపించారు. ఈ ప్రక్రియ ఎందుకు ఇలా జరుగుతోంది అన్న ప్రశ్నకి సమాధానం అందించారు. అందుకుగానూ ప్రపంచం 1930 డిసెంబర్‌లో సి.వి.రామన్ కు నోబెల్ బహుమతి ప్రకటించారు. 1954లో ఆయనకు భారతరత్న పురస్కారం ఇచ్చి, గౌరవించారు.


లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

09 : జవాబు

నేను గీసిన బొమ్మ



- సూర్యా
మధురై, తమిళనాడు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కథల దుకాణం.. క(ళ)లల ప్రయాణం..

ఆ ఊరి పిల్లల కోసం కథలు కదిలివస్తున్నాయి. పిల్లలతో ఆటలాడుకునేందుకు వందల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. దారి పొడుగునా పైన్ చెట్లతో భూమి నిట్ట నిలువునా చీలినట్లుగా ఉండే గున్‌హర్ లోయ ప్రాంతమది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామమైన అక్కడ ఓ మట్టి ఇల్లు ముంగిట ప్రతి రోజూ పిల్లలంతా గుమిగూడి తమ కథల ప్రపంచాన్ని ఆవిష్కరించుకుంటారు. వారే కథకులు, శ్రోతలు, నటీనటులు, దర్శకులు.. ఇదంతా ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం. గతంలో.. అదివరకెప్పుడూ ఆ పిల్లలు నీలి రంగు ఆకాశాన్ని చూసింది లేదు. ఆకుపచ్చ గడ్డిని పరిశీలించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే పిల్లల సహజ ప్రపంచానికి దూరంగా జీవించేవారు. అటువంటి చోట 'కహానీ కి దుకాణ్' పేరుతో క(ళ)లల దారి వేస్తోంది ఢిల్లీకి చెందిన అనూప్ చౌఘ్, జాస్మిన్ కౌర్ మిత్రద్వయం.





'అక్కడికి ప్రతిరోజూ సందర్శకులు వస్తారు. ఆ ప్రాంత అందాలను చూసి ఔరా అంటారు. అక్కడ ఉంటున్న గ్రామస్తులు అదృష్టవంతులని కొనియాడతారు. కాని ఆ ప్రజల సామాజిక స్థితిగతులు, మానసిక వికాసం గురించి ఎవరూ పట్టించుకోరు. వాస్తవానికి కనీస సౌకర్యాలు లేని ఆ గ్రామంలో పిల్లలు బడికెళ్లిందే లేదు. పురాతన ఆదివాసీ తెగలు నివసించే ఆ లోయలో ఇంతవరకు బడిముఖం చూడని వారే ఎక్కువ. ఇప్పుడు మాతో ప్రయాణిస్తున్న ఈ పిల్లలు స్కూలుకు వెళుతున్న మొదటితరం వారు' అంటున్నాడు అనూప్.

'కహానీ కి దుకాణ్' పేరుతో ఆ పిల్లల సృజనను వెలికితీసేందుకు అనూప్, జాస్మిన్ తమ ఉద్యోగాలకు స్వస్తి చెప్పారు. ఢిల్లీ చాందినీ చౌక్ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఈ మిత్రులిద్దరూ భిన్న రీతుల్లో జీవితాలను ప్రారంభించారు. అనూప్ కథలు రాయడంలో తీరికలేకుండా గడిపితే.. జాస్మిన్ షూ డిజైనర్‌గా రాణించింది. అయితే దేశంలోని మారుమూల ప్రాంతాలకు వెళ్లాలని, కథలను, కళలను ఆ ప్రాంతాలకు పరిచయం చేయాలని ఇద్దరూ కలలుగనేవారు. ఓసారి ఓ సంస్థ ఆధ్వర్యంలో గున్‌హర్‌కు సమీపంలోని 'బిర్' ప్రాంతంలో నెలరోజుల పాటు ఈ మిత్రులిద్దరూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఉండే వ్యక్తులతో సంభాషించడం, ఆ వ్యక్తుల గురించి కథలు రాయడం, ఈ కథనాలపై ఆడియో ఆల్బమ్‌లు రూపొందించడం లక్ష్యంగా పనిచేశారు. 'మా పని పూర్తయి ఆ ప్రాంతం నుండి బయలుదేరే సమయం వచ్చింది. అయితే మేము బిర్ నుండి చాలాసార్లు గున్‌హర్‌కు ప్రయాణించాం. ఆ ప్రాంతం మాకు ఎంతో నచ్చింది. కాని అక్కడి పిల్లలను చూసినప్పుడు చాలా బాధేసేది. మేము ఢిల్లీకి వచ్చేసినా ఆ జ్ఞాపకాలు మమ్మల్ని వదలలేదు. అప్పుడే 'కహానీ కి దుకాణ్'కు బీజం పడింది' అంటుంది జాస్మిన్.

2019లో గున్‌హర్‌లో ప్రారంభమైన 'కహానీ కి దుకాణ్' ఇప్పుడు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లో 35 గ్రామాలకు విస్తరించింది. ఐదు గ్రామాల్లో ఆర్ట్ లైబ్రరీలు కూడా ప్రారంభించారు. వారం వారం 'కహానీ కి దుకాణ్' ఆయా గ్రామాలకు సందర్శనలకు వెళ్లినప్పుడు గ్రామస్తుల ముందు కథల ప్రదర్శన, కళల ప్రదర్శన ఇస్తారు. ఆసక్తి ఉన్న గ్రామస్తులు, పిల్లలతో సొంత కథలను చెప్పిస్తారు. రచన, థియేటర్ ప్రదర్శన, చిత్రలేఖనం వంటి వాటిలో శిక్షణ ఇస్తూ వర్క్‌షాపులు కూడా నిర్వహి స్తున్నారు.



'బయటి నుండి చూస్తే గ్రామంలోని పిల్లలందరూ ఒకటేలా భావిస్తాం. కాని మా ప్రయాణంలో ఆ పిల్లలందరినీ ఒకత్రాటిపైకి తీసుకురావడానికి పెద్ద పోరాటమే చేయాల్సి వచ్చింది. వారిలో నిమ్న కుల పిల్లలతో చేరి కథలు చెప్పేందుకు, వినేందుకు, కళల ప్రదర్శన చేసేందుకు అగ్ర కుల పెద్దలు వారి పిల్లలను పంపేవారు కాదు. ఆ పిల్లలను కూడా మాతో ప్రయాణింపజేసేందుకు, పెద్దలను ఒప్పించేందుకు చాలా కష్టపడ్డాం. పిల్లలంతా ఒక్కచోటకు చేరిన తరువాత ఇంటిపేర్లతో పిలవడం మానేయమని కఠిన నిబంధనలు పాటించాం' అంటూ తమ తొలిరోజుల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంది జాస్మిన్.

'మేము చెప్పే కథల్లో కులం, మతం, జాతి వివక్షకు తావులేకుండా పిల్లలంతా ఒకేమాదిరి ఎదగాలన్నట్లు చెప్పేవాళ్లం. ఆ కథలు చెప్పేటప్పుడు పిల్లలంతా చాలా శ్రద్ధగా వినేవాళ్లు. క్రమేపీ వారిలో స్నేహభావం పెరిగింది. బిడియపడుతూ దూరంగా కూర్చొనే పిల్లలు కూడా ఒక్కొక్కరిగా ముందుకు వచ్చి వినేవారు. ఆ వాతావరణం మమ్మల్ని మరింత ప్రోత్సహించేది' అంటున్నారు అనూప్.


పరిశీలన, అంచనా, ప్రణాళిక, వివరణలో పిల్లలెప్పుడూ సహజసిద్ధంగా ఉండాలి. మేము చెప్పే కథలు, కల్పనలన్నీ ఆ లక్ష్యాల కోసమే నిర్దేశించుకున్నాం. వీటిద్వారా పిల్లలు తమను తాము కనుగొంటారు. వారి కలలు పెద్దగా ఉంటాయి. మేము మా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు పిల్లలంతా నీలి రంగు ఆకాశాన్ని పసుపుపచ్చగా, ఆకుపచ్చ గడ్డిని ఊదారంగులో చిత్రించేవారు. వారి ఆలోచన, పరిశీలన అంతవరకే ఉండేది. కాని ఇప్పుడు వారంతా సృజనకు పదునుబెడుతున్నారు. బొమ్మలను చూసి కథలు రాస్తున్నారు, చెబుతున్నారు. మాతో పాటు ప్రయాణిస్తూ ఇతర గ్రామాల పిల్లలతో తమ అనుభవాలు పంచుకుంటున్నారు. అయితే దేశంలో అన్ని ప్రాంతాల పిల్లలకు ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఈవిధమైన ప్రోత్సాహాలు ఉండవు. మా 'కహానీ కి దుకాణ్' ద్వారా ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అంటూ ముక్తకంఠంతో చెబుతున్నారు ఈ మిత్రులు. ఇప్పటివరకు 2 వేల మంది చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేసిన ఈ స్నేహితుల సంకల్పం నిజంగా గొప్పది.



ఇకపై నన్ను ఏదీ బాధించదు..







'ఇప్పటివరకూ తనని ఎన్నో విషయాలు బాధించాయని.. ఇకపై ఏదీ తనని బాధపెట్టద'ని సమంత అంటున్నారు. 'ఏమాయ చేసావే' చిత్రంతో నటిగా ఆమె ప్రయాణం మొదలుపెట్టి ఫిబ్రవరి 26కి 13 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా.. అభిమానులను ఉద్దేశిస్తూ ఆమె ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. తనపై ప్రేమను చూపిస్తోన్న అభిమానులకు కృతజ్ఞతలు చెప్పారు. వాళ్ల ప్రేమ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని.. ఇది ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకున్నారు. 'నేను ఎంత ఎదిగినా.. ఎంత దూరం ప్రయాణించినా.. మీరు చూపించే ప్రేమాభిమానాన్ని మర్చిపోలేను. నాపై ఇంతటి అభిమానాన్ని చూపిస్తున్నందుకు ధన్యవాదాలు. అలాగే, కొత్త విషయాలను పరిచయం చేస్తోన్న ప్రతిరోజుకూ కృతజ్ఞతలు. గతంలో ఎన్నో విషయాలు నన్ను బాధించేవి.. కానీ, ఇకపై కాదు. కేవలం ప్రేమ, కృతజ్ఞతతో కొనసాగుతున్నా' అని సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. జెస్సీ పాత్రలో తన ఫొటోలను షేర్ చేశారు.

ఈ సందర్భంగానే నాగచైతన్య కూడా 'ఏమాయ చేసావే' చిత్రం 13 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలుపుతూ నాగచైతన్య, సమంత కలిసివున్న ఫొటోలను షేర్ చేశారు. ఈ రెండు పోస్టులు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఏడుగురు విలన్లు.. ముగ్గురు హీరోయిన్లు..



కమలహాసన్, శంకర్ దర్శకత్వంలో రాబోతున్న ఇండియన్ 2 చిత్రంలో ఏడుగురు విలన్లు.. ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నట్లు సమాచారం. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవాని శంకర్ హీరోయిన్లుగా నటిస్తుంటే.. సముద్ర ఖని, బాబీ సింహా, జయప్రకాష్, గురు సోమసుందరం, మరిముత్తు, వెన్నెల కిషోర్, శివాజీ గురువాయూర్ ప్రతినాయక పాత్రలను చేస్తున్నారు. లైకా సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ నాలుగేళ్ల క్రితమే ప్రారంభమైనా పలు కారణాలతో షూటింగ్ మధ్యలో ఆగిపోయింది. ఇటీవలే మళ్లీ ఈ చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. ప్రస్తుతం చెన్నైలో షూటింగ్ జరుపుకుంటోంది. యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ సన్నివేశాల్లో తమిళ్, బ్రిటీష్ స్టంట్ కళాకారులు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది.

'నేను స్టూడెంట్ సార్' విడుదల వాయిదా



బెల్లంకొండ గణేష్ నటించిన తాజా చిత్రం 'నేను స్టూడెంట్ సార్' సినిమా విడుదల వాయిదా పడినట్లు తెలుస్తోంది. రాఖీ ఉప్పలపాటి తెరకెక్కించిన ఈ సినిమా మార్చి 10న విడుదలచేస్తారని గతంలో ప్రకటించారు. అయితే ఆ తేదీలో సినిమా రిలీజ్‌ని వాయిదా వేస్తూ వేసవి సెలవుల కానుకగా రిలీజ్‌కి సిద్ధం చేస్తున్నట్లు తాజాగా మేకర్స్ తెలిపారు. ఈ సినిమాలో అవంతిక హీరోయిన్‌గా నటిస్తుండగా మహతి సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఎస్ వి 2 ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణం వహించారు.



మలయాళ దర్శకుడు జోసెఫ్ మృతి

మలయాళ యువ దర్శకుడు జోసెఫ్ మను జేమ్స్ కన్నుమూశారు. 31 ఏళ్ల జేమ్స్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గత రాత్రి మరణించారు. ఈ యువ దర్శకుడి మృతితో మలయాళ చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. జేమ్స్ దర్శకత్వం వహించిన తొలి సినిమా 'నాన్సీ రాణి' త్వరలోనే విడుదలవ్వనుంది. ఆయన మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. జేమ్స్ గతంలో బాల నటుడిగానూ అలరించారు. 'ఐయామ్ క్యూరియస్' సినిమాలో ఆయన బాలనటుడిగా నటించారు. తరువాత పలు మలయాళ, హిందీ, కన్నడ సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

కెఎల్ రాహుల్ నిరూపించుకోవాలి

శుభ్‌మన్‌నుంచి తీవ్ర పోటీ

సౌరవ్ గంగూలీ



కోల్‌కతా: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఓపెనర్ కెఎల్ రాహుల్ పరుగుల వేటలో విఫలమౌతున్నా.. సెలెక్టర్లు అతనిపై పెట్టునున్న నమ్మకాన్ని నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని బిసిసిఐ మాజీ అధ్యక్షులు సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. తొలి రెండు టెస్టుల్లో భాగంగా మూడు ఇన్నింగ్స్‌లో కెఎల్ రాహుల్ (20, 17, 1) 38 పరుగులే చేశాడని, అలాగే గత 10 టెస్టుల్లో ఏనాడూ 25పరుగుల మార్క్‌ను దాటలేక పోయాడని చెప్పుకొచ్చాడు. టాప్‌క్లాస్ బ్యాటర్‌గా గుర్తింపు పొందిన కేఎల్ రాహుల్ సౌరవ్ గంగూలీ మద్దతు తెలుపుతూ.. గతంలో ఎందరో క్రికెటర్లు ఫామ్ లేమితో బాధపడ్డారని, అలాంటప్పుడే అతనికి మద్దతుగా నిలవాలన్నాడు. త్వరలో ఇండియన్ ప్రిమియర్‌లీగ్(ఐపిఎల్) జరగనుందని, ఆ సమయానికి కెఎల్ రాహుల్ ఫామ్‌ను అందిపుచ్చుకోవడం ఖాయమని జోస్యం చెప్పాడు. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా రెండేళ్లుగా పరుగుల వేటలో వెనుకబడ్డాడని, కానీ ఇటీవలి కాలంలో అతని బ్యాట్ నుంచి పరుగులు జాలువారుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. గతంలో రాహుల్ ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లపై స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడిన విషయాన్ని ఈ సందర్భంగా మర్చిపోకూడదని చెప్పుకొచ్చాడు. తొమ్మిదేళ్ల టెస్ట్ కెరీర్‌లో కెఎల్ రాహుల్ కేవలం 7 సెంచరీలే చేసినా సెలెక్టర్లు, కోచ్, కెప్టెన్ అతనికి మద్దతుగా నిలవడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నాడు. బెంగళూరుకు చెందిన కెఎల్ రాహుల్ 47 టెస్టుల్లో 33.44 సగటుతో 2,642 పరుగులు చేశాడు.

శుభ్‌మన్‌నుంచి తీవ్ర పోటీ..

కేఎల్ రాహుల్‌కు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌నుంచి తీవ్ర పోటీ ఎదురౌతుందని గంగూలీ పేర్కొన్నాడు. టెస్ట్ జట్టులో చోటు దక్కించుకున్న పంజాబ్‌కు చెందిన శుభ్‌మన్ తుది 11మంది ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించుకో లేకపోతున్నాడని, ఇందుకు కారణంగా కెఎల్ రాహుల్ నాణ్యమైన ఓపెనర్‌గా గుర్తింపు పొందడ మేనన్నాడు. ఇటీవలికాలంలో శుభ్‌మన్ గిల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడని, కెఎల్ రాహుల్‌ను తప్పించి శుభ్‌మన్‌ను ఆడించాలని మాజీ క్రికెటర్లు నుంచి ఒత్తిడి ఎదురౌతున్నా.. సెలెక్టర్లు, కెప్టెన్, కోచ్ అతనిపై నమ్మక ముంచారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు.

మూడో టెస్ట్‌కు ఇండోర్ సిద్ధం

తొలి రెండు టెస్ట్ మ్యాచ్‌ల ఫలితం మూడురోజుల్లోనే రావడం, ఆ పిచ్‌ల నాణ్యతపై ఐసిసి రేటింగ్ ప్రకటించిన నేపథ్యంలో మూడో టెస్ట్ బ్యాటర్స్‌కు అనుకూలించే పిచ్ తయారు చేస్తున్నట్లు సమాచారం. మూడో టెస్ట్ జరిగే ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం తొలి రోజు తొలి సెషన్ బౌలర్లకు అనుకూలంగా ఉన్నా.. క్రమంగా బ్యాటర్స్‌కు సహకరించనుందని, చివరి రెండు రోజులు పూర్తిగా బౌలర్లకు ఆధిపత్యం కొనసాగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

గుజరాత్ జెయింట్స్ కెప్టెన్‌గా మూనీ



అహ్మదాబాద్: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)-2023 గుజరాత్ జెయింట్స్ కెప్టెన్‌గా బెత్ మూనీ ఎంపికైంది. ఆ ఫ్రాంచైజీ ట్విటర్ వేదికగా.. ఆస్ట్రేలియా మహిళల జట్టు ఓపెనర్ బెత్ మూనీ ఆరంభ సీజన్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొంది. మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్లో మూనీ 74పరుగులతో రాణించింది. మహిళల ప్రిమియర్ లీగ్ మార్చి 4నుంచి 26వరకు ముంబయి వేదికలుగా జరనున్న సంగతి తెలిసిందే. ఐదు జట్ల మధ్య జరిగే డబ్ల్యుపిఎల్‌లో బెంగళూరు జట్టుకు స్మృతి మంధాన, యుపి జట్టు ఎలిస్సా హీలీ(ఆస్ట్రేలియా)ను కెప్టెన్లుగా నియమించుకోగా.. ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమ తమ కెప్టెన్లను ఇంకా ప్రకటించాల్సి ఉంది.

పునరాగమనానికి గొప్ప వేదిక: పూనమ్ యాదవ్

ఆటగాళ్లు తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడానికి డబ్ల్యుపిఎల్ గొప్ప వేదిక అని స్పిన్నర్ పూనమ్ యాదవ్ అభిప్రాయపడింది. పూనమ్ యాదవ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.30లక్షలకు దక్కించుకుంది.

విలియమ్సన్ రికార్డు



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ టెస్టుల్లో ఓ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండోటెస్టు రెండో ఇన్నింగ్స్‌లో విలియమ్సన్(132)పరుగులు చేసి న్యూజిలాండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 26వ శతకాన్ని పూర్తి చేసుకోవడంతోపాటు రాస్ టేలర్ అత్యధిక పరుగుల రికార్డును అధిగమించి రికార్డుల్లోకెక్కాడు. ప్రస్తుతం విలియమ్సన్ 7787 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా.. రాస్ టేలర్ (7683) రెండో స్థానంలో నిలిచాడు. ఇక స్టీఫెన్ ఫ్లెమింగ్(7172), బ్రెండన్ మెక్‌కల్లమ్(6453), మార్టిన్ క్రో(5444) వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచారు. రాస్ టేలర్ 196 ఇన్నింగ్స్‌లో ఈ ఫీట్‌ని సాధించగా.. విలియమ్సన్ 161 ఇన్నింగ్స్‌ల్లోనే టేలర్ రికార్డుని బ్రేక్ చేయడం విశేషం. ఇక ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ జట్టు 483పరుగుల భారీస్కోర్ చేసింది. దీంతో ఇంగ్లండ్‌కు 258 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో ఇంగ్లండ్ జట్టు నాల్గోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టానికి 48పరుగులు చేసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68